# హైదరాబాద్ పల్స్

జాతీయ తెలుగు దినపత్రిక

దేశం ముఖ్యం.... దేశ ప్రజల భద్రత ముఖ్యం.... మతం కాదు...

epaper.hyderabadpulsenews.in



విలేకరులు కావలెను

హైదరాబాద్ పల్స్

"ఎంతకైనా తెగిస్తాం... ప్రజల గొంతుకై నిలుస్తాం" అనే నినాదంతో రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రారంభించిన హైదరాబాద్ పల్స్ జాతీయ దినపత్రికకు తెలుగు రాష్ట్రాలలోని అన్ని మండల, నియోజకవర్గాల, జిల్లాల వ్యాప్తంగా విలేకరులు కావలెను. * సీనియర్లకు ప్రాధాన్యత కలదు.

సంప్రదించవలసిన ఫోన్ నెంబర్స్

- Dr. RAHUL KUMAR 9989834020

- K. Naveen Kumar 94406 53413

www.hyderabadpulse.com HyderabadPulse @hyderabad



సీఈఓ : కె నవీన్ కుమార్ | ఎడిటర్: డా. రాహుల్ కుమార్ | సంపుటి: 03 | సంచిక : 201 | పేజీలు : 08 | శనివారం | 01-08-2026 | వెల :4/-

SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD, SANGAREDDY, WARANGAL, MANCHIRYAL, VIJAYWADA, GUNTUR, KURNOOL, TIRUPATI, KADAPA, BENGALURU, MUMBAI, CHENNAI, DELHI.


## విద్యార్థులను అవమానిస్తారా?



2

- జెన్ జీ, ఇంజనీరింగ్ విద్యార్థులను అవమానిస్తారా?: రేవంత్ రెడ్డిపై కిషన్ రెడ్డి ఫైర్
- ఉపాధ్యాయుల సమావేశంలో విద్యార్థులను రేవంత్ అవమానించారన్న కిషన్ రెడ్డి
- విద్యార్థులను క్రిమినల్స్‌తో పోల్చడం సరికాదని వ్యాఖ్య
- విద్యా వ్యవస్థను బలోపేతం చేయడంపై దృష్టి పెట్టాలని హితవు


## టామ్‌కాం సేవలను మరింతగా బలోపేతం చేయాలి: సీఎం రేవంత్‌రెడ్డి

2

హైదరాబాద్ పల్స్,హైదరాబాద్

తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్ పవర్ కంపెనీ టామ్‌కాం సేవలను మరింతగా బలోపేతం చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు టామ్‌కాంకు కొత్త బాధ్యతలు అప్పగిస్తున్నట్లు

# ఈవీ, డ్రోన్ టెక్నాలజీ కోర్సులు



- అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ సెంటర్లలో ఈవీ, డ్రోన్ టెక్నాలజీ కోర్సులు :సీఎం రేవంత్ రెడ్డి ఆదేశం
- నైపుణ్యాభివృద్ధిశక్తి కార్యక్రమాలపై సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష
- స్కిల్ యూనివర్సిటీలో రీసెర్చ్ సెంటర్ ఏర్పాటు చేయాలని ఆదేశం
- టామ్‌కామ్‌ను మరింత బలోపేతం చేయాలని అధికారులకు సూచన

హైదరాబాద్ పల్స్,హైదరాబాద్

తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ టామ్‌కామ్‌ను మరింత బలోపేతం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. పాస్‌పోర్టు నుంచి విదేశీ కంపెనీల్లో ఉద్యోగాల వరకు టామ్‌కామ్ బాధ్యత తీసుకోవాలని సీఎం సూచించారు. ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీ బోధి పెవెలియన్‌లో స్కిల్స్, క్యాపిటల్, నాలెడ్జ్ ట్రెయినింగ్ ఇనీషియేటివ్ శాఖ(శక్తి) కార్యక్రమాలపై సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు.

ఇంటర్న్‌షిప్ అవకాశాలు కల్పించాలి

ప్రభుత్వ ఇంజినీరింగ్ కాలేజీలు, ఐటీఐలు, ఏటీసీలు, పాలిటెక్నిక్ కళాశాలల్లో చదివే విద్యార్థులకు పెద్ద కంపెనీల్లో ఇంటర్న్‌షిప్ చేసే అవకాశం కల్పించాలని సీఎం సూచించారు. ఓ వైపు చదువుకుంటూనే, మరో వైపు ఇంటర్న్‌షిప్ చేయడం ద్వారా వారికి స్టైఫండ్ లభిస్తుందని ఆయన





2

## పోరాటాలను అక్రమ కేసులు ఆపలేవు

నాంపల్లి కోర్టుకు హాజరైన కేటీఆర్

- ఫార్ములా-ఈ రేసు కేసుకు సంబంధించి కోర్టు విచారణకు హాజరైన కేటీఆర్
- తదుపరి విచారణకు ఆగస్టు 25కి వాయిదా వేసిన కోర్టు
- పెద్ది సుదర్శన్ రెడ్డి అంత్యక్రియల్లో పాల్గొనేందుకు బయల్దేరిన కేటీఆర్

2



## ఈ-కేవైసీ గడువు పెంపు

రేషన్ కార్డుదారులకు ఊరట..





2

## రంగనాథ్‌ను త్వరగా బదిలీ చేయండి

ఉత్తర్వులు జారీ చేసిన హైకోర్టు

- హైడ్రా, శాంతాశ్రీరామ్ కన్‌స్ట్రక్షన్ కంపెనీ కేసులో వెలువడిన కోర్టు ఉత్తర్వులు
- హైడ్రా కమిషనర్ కోర్టు ఉత్తర్వులను ఉల్లంఘించారన్నది సుస్పష్టమన్న హైకోర్టు
- రంగనాథ్‌ను వీలైనంత త్వరగా బదిలీ చేయాలని సీఎస్‌కు సూచించిన హైకోర్టు





2



హైదరాబాద్ పల్స్,హైదరాబాద్

హైడ్రా, శాంతాశ్రీరామ్ కన్‌స్ట్రక్షన్ కంపెనీ కేసులో హైకోర్టు ఉత్వర్వులు ఎట్టకేలకు వెలువడ్డాయి. హైడ్రా కమిషనర్ కోర్టు ఉత్తర్వులను ఉల్లంఘించారన్నది సుస్పష్టమని హైకోర్టు తెలిపింది. వివాదాస్పద ఆస్తిలోకి యంత్రాలు, సిబ్బందితో వెళ్లటం చట్టవిరుద్ధమన్న రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం, రంగనాథ్‌ను వీలైనంత త్వరగా బదిలీ చేయాలని సీఎస్‌కు సూచించింది.ఇందుకు తాతా మోహన్‌రావు కేసులో సుప్రీంకోర్టు ఉత్తర్వులను



2

## ఎస్ఐఆర్ గడువు ఆగస్టు 10 వరకు

- తెలంగాణలో ఎస్ఐఆర్ గడువు తేదీ మరోసారి పెంపు
- తెలంగాణ రాష్ట్రంలో ఎస్ఐఆర్ ప్రక్రియ గడువు తేదీ మరోసారి పొడిగించిన ఈసీ
- ఎన్యుమరేషన్ ఫారాలు సమర్పించే గడువు ఆగస్టు 10 వరకు పొడిగింపు
- రాష్ట్రవ్యాప్తంగా 77.12 శాతం ఎన్యుమరేషన్ పూర్తి

## కర్ణాటకకు రావొద్దు..

తమిళనాడు సీఎం విజయ్‌కు డీకే శివకుమార్ సూచన

- కావేరి ఉద్రిక్తతల పర్యటన సరికాదని సూచన
- అఖిలపక్ష సమావేశం తర్వాత కొత్త తేదీ
- వర్షాలతో పరిస్థితులు మెరుగుపడతాయని డీకేఎస్ ఆశాభావం
- మేకెదాటు ప్రాజెక్టు తమిళనాడుకూ ఉపయోగకరమన్న శివకుమార్
- సుప్రీంకోర్టు తీర్పుకు కట్టుబడతామని స్పష్టీకరణ

హైదరాబాద్ పల్స్,హైదరాబాద్

కావేరి వివాదం నేపథ్యంలో తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ బెంగళూరు పర్యటనను వాయిదా వేసుకోవాలని కర్ణాటక సీఎం డీకే శివకుమార్ సూచించారు. ఆగస్టు 3న మంత్రులతో కలిసి బెంగళూరుకు వస్తానని విజయ్ తెలిపారని, ప్రస్తుత పరిస్థితుల్లో పర్యటన సరైనది కాదని తాను



2



## పోటెత్తుతున్న గోదావరి..

భద్రాచలం వద్ద రెండో ప్రమాద హెచ్చరిక జారీ


- భద్రాచలం వద్ద 48 అడుగులకు చేరుకున్న గోదావరి నీటి మట్టం
- నిండుకుండలా మారిన తెలంగాణలోని జలాశయాలు
- జలాశయాలకు వరద పెరుగుతుండటంతో అప్రమత్తమైన అధికారులు



2

## భోగాపురం..ఆధునిక ఎయిర్ పోర్టుకు ప్రతిరూపం

- భోగాపురంలో రేపు అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభం
- భోగాపురంలో సెమీకండక్టర్ ప్రాజెక్టుకు శంకుస్థాపన
- కర్నూలు పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టుకు శ్రీకారం
- కీలక జాతీయ రహదారి ప్రాజెక్టులు జాతికి అంకితం
- సోషల్ మీడియా వేదికగా వెల్లడించిన ప్రధాని నరేంద్ర మోదీ



2

హైదరాబాద్ పల్స్,హైదరాబాద్

ఆంధ్రప్రదేశ్‌లో పలు కీలక అభివృద్ధి ప్రాజెక్టులపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కీలక ప్రకటన చేశారు. రాష్ట్ర అభివృద్ధిని కొత్త పుంతలు తొక్కించే ఈ ప్రాజెక్టుల వివరాలను ఆయన సోషల్ మీడియా వేదికగా పంచుకున్నారు. వీటిలో ప్రధాన ఆకర్షణగా విజయనగరం జిల్లా భోగాపురంలో నిర్మించిన అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం నిలుస్తోంది. ఈ

# విద్యార్థులను అవమానిస్తారా?

మొదటి పేజీ రువాయి

ఇటీవల ఉపాధ్యాయులతో నిర్వహించిన సమావేశంలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యార్థులపై చేసిన వ్యాఖ్యలను కేంద్రమంత్రి జి.కిషన్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. ఇంజనీరింగ్ విద్యార్థులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అవమానించారని మండిపడ్డారు. ఇది సరైన పద్ధతి కాదని... యువతను 'క్రిమినల్ వేస్ట్' అని సంబోధించడం అత్యంత బాధాకరమని అన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించాలని విద్యార్థులు డిమాండ్ చేస్తున్నారనే అక్కసుతోనే రేవంత్ రెడ్డి ఇలాంటి వ్యాఖ్యలకు దిగారని ఆయన ఆరోపించారు.దేశ నిర్మాణంలో ఇంజనీర్లు అత్యంత కీలక పాత్ర పోషిస్తున్నారని కిషన్ రెడ్డి చెప్పారు. విద్యార్థులను క్రిమినల్స్‌తో పోల్చడం సిగ్గుచేటని మండిపడ్డారు. జెన్ జీ ఆకాంక్షలకు, భావాలకు వ్యతిరేకంగా పాలకులు వెళ్లడం సరికాదని హితవు పలికారు. రేవంత్ రెడ్డి విద్యార్థులపై నిందలు వేయడం మాని, రాష్ట్రంలో విద్యా వ్యవస్థను బలోపేతం చేసేందుకు అవసరమైన విద్యా సంస్కరణలపై దృష్టి పెట్టాలని సూచించారు.

# విద్యార్థులను అవమానిస్తారా?

మొదటి పేజీ రువాయి

"ప్రజల తరఫున మేం చేసే పోరాటాలను ఇటువంటి తప్పుడు కేసులు ఎంతమాత్రం ఆపలేవు.. అంతిమంగా సత్యమే గెలుస్తుంది" అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ ఘాటుగా వ్యాఖ్యానించారు. ఫార్ములా–ఈ రేసు వ్యవహారానికి సంబంధించిన కేసు విచారణలో భాగంగా నాంపల్లి కోర్టుకు హాజరైన సందర్భంగా ఆయన కాంగ్రెస్ ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు.ఉదయం కోకాపేటలోని తన నివాసం నుంచి నేరుగా నాంపల్లి కోర్టుకు కేటీఆర్ చేరుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తనపై కుట్రపూరితంగా అక్రమ కేసు బనాయించిందని ఆయన మండిపడ్డారు. మరోవైపు, తదుపరి విచారణకు కోర్టు ఆగస్టు 25కి వాయిదా వేసింది. కోర్టు ప్రక్రియ ముగిసిన అనంతరం, అకాల మరణం చెందిన పార్టీ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి అంత్యక్రియల్లో పాల్గొనేందుకు ఆయన నర్సంపేటకు బయలుదేరారు.

**కేసు నేపథ్యం:**

యూకేకు చెందిన 'ఫార్ములా–ఈ ఆర్గనైజేషన్'కు నిబంధనలకు విరుద్ధంగా రూ. 55 కోట్లు మళ్లించారనే అభియోగంపై ఏసీబీ ఈ కేసు నమోదు చేసింది. సుదీర్ఘ దర్యాప్తు అనంతరం ఏసీబీ దాఖలు చేసిన ఛార్జ్‌షీట్‌ను కోర్టు పరిగణనలోకి తీసుకోవడంతో, నిందితులుగా ఉన్న కేటీఆర్‌తో పాటు మాజీ ఐఏఎస్ అధికారి అరవింద్ కుమార్, హెచ్ఎండీఏ మాజీ అధికారి బీఎల్ఎన్ రెడ్డి తదితరులు న్యాయస్థానానికి హాజరయ్యారు.

# ఎస్ఐఆర్ గడువు ఆగస్టు 10 వరకు

మొదటి పేజీ రువాయి

తెలంగాణ రాష్ట్రంలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ గడువు తేదీని ఎన్నికల సంఘం(ఈసీ) మరోసారి పొడిగించింది. ఆగస్టు3వ తేదీతో పూర్తి కావాల్సిన ఎన్యూమరేషన్ ప్రక్రియను ఆగస్టు 10 వరకు పొడిగిస్తూ ఈసీ నిర్ణయం తీసుకుంది. ఎన్యుమరేషన్ ఫారాలు పంపిణీ పూర్తయినప్పటికీ, ఓటర్లు వాటిని నింపి ఇవ్వాల్సి ఉంది.తెలంగాణలో 77.12 శాతం

**ఎన్యుమరేషన్ పూర్తి**

ఎన్యూమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియ పూర్తవ్వాల్సి ఉంది. జూన్ 25 నుంచి రాష్ట్రంలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ జరుగుతోంది. ఇప్పటి వరకు రాష్ట్రవ్యాప్తంగా 77.12 శాతం ఎన్యూమరేషన్ పూర్తయినట్లు ఈసీ తెలిపింది. హైదరాబాద్? నగరంలో 56.31 శాతం, రంగారెడ్డి జిల్లాలో 63.43 శాతం ఎన్యుమరేషన్ పూర్తయినట్లుగా ఎన్నికల సంఘం వెల్లడించింది. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో 61.37శాతం ఎన్యుమరేషన్ పూర్తయింది.

# పోటెత్తుతున్న గోదావరి..

మొదటి పేజీ రువాయి

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు భద్రాచలం వద్ద గోదావరి నది ఉగ్రరూపం దాల్చింది. ఎగువ నుంచి వచ్చి చేరుతున్న భారీ వరదతో నీటి మట్టం మధ్యాహ్నానికి ఏకంగా 48 అడుగులకు చేరుకుంది. ప్రస్తుతం అధికారులు 11,44,507 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. నీటిప్రవాహం గంటగంటకూ పెరుగుతుండటంతో నదీ పరివాహక ప్రాంతాలు, లోతట్టు ప్రాంతాల ప్రజలు తీవ్ర అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు.మరోవైపు, తెలంగాణలోని ప్రధాన జలాశయాలన్నీ వరద నీటితో నిండుకుండలా మారాయి. కడెం ప్రాజెక్టు నీటిమట్టం 698.02 అడుగులకు (పూర్తి స్థాయి 700 అడుగులు) చేరగా, 10,282 క్యూసెక్కుల ఇన్ ఫ్లో నమోదవుతోంది. శ్రీరామ్ సాగర్ ప్రాజెక్టులోకి 70 వేల క్యూసెక్కుల వరద వస్తుండగా, నీటిమట్టం 1069 అడుగుల వద్ద ఉంది.ఇక శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 148 మీటర్లు కాగా, ప్రస్తుతం 147.30 మీటర్లకు చేరుకుంది. ఎల్లంపల్లిలోకి 1,32,785 క్యూసెక్కుల ఇన్ ఫ్లో వస్తుండటంతో, అంతే మొత్తంలో (1,32,785 క్యూసెక్కులు) నీటిని దిగువకు వదులుతున్నారు. అలాగే మిడ్ మానేరు ప్రాజెక్టులోకి 18,445 క్యూసెక్కుల ఇన్ ఫ్లో కొనసాగుతోంది. జలాశయాల నీటిమట్టం వేగంగా పెరుగుతుండటంతో ప్రాజెక్టుల వద్ద యంత్రాంగం నిరంతరం పరిస్థితిని సమీక్షిస్తోంది.

# రంగనాథ్‌ను త్వరగా బదిలీ చేయండి

మొదటి పేజీ రువాయి

రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం ఉదహరించింది. చట్టబద్ధపాలన మాత్రమే కొనసాగాలని, వ్యక్తుల పాలన కాదని కోర్టు స్పష్టం చేసింది. వ్యక్తుల ఆధిపత్యం పెరిగితే ప్రజాస్వామ్యానికి మరణశాసనం అవుతుందని, వ్యక్తి ఆధిపత్యం పెరిగిందనేందుకు ఇదొక ఉదాహరణ అని హైకోర్టు అభిప్రాయం వ్యక్తం చేసింది.

**ఇదీ కేసు నేపథ్యం**

లోతుకుంటలోని సర్వే నెంబర్లు– 1, 2లలో ఉన్న నలభై ఎకరాల భూములు శాంతా శ్రీరామ్ కన్‌స్ట్రక్షన్స్ కంపెనీ స్వాధీనంలో ఉన్నాయి. ఈ భూముల్లో హైడ్రా జోక్యం చేసుకొని ఫెన్సింగ్ వేసిందని, హైకోర్టు ఉత్తర్వులున్నప్పటికీ లెక్కచేయకుండా హైడ్రా వ్యవహరిస్తోందని శాంతాశ్రీరామ్ కంపెనీ కొద్దిరోజుల క్రితం కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేసింది. 40 ఎకరాల భూమి శాంతా శ్రీరామ్ కన్‌స్ట్రక్షన్స్ కంపెనీకే చెందుతుందని న్యాయస్థానం ఉత్తర్వులున్నప్పటికీ హైడ్రా అధికారులు ఫెన్సింగ్ వేశారని కోర్టుకు తెలిపింది. పలుమార్లు కోర్టు ధిక్కరణకు పాల్పడుతుండటంతో హైడ్రా కమిషనర్ రంగనాథ్‌పై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. అతడిని ఆ హోదా నుంచి తప్పించాలని సీఎస్‌ను ఆదేశించింది.అంతకు ముందు ఈ నెల 20వ తేదీ జరిగిన విచారణ సందర్భంగా హైడ్రాపై హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. కోర్టు ధిక్కరణకు పాల్పడినందుకు హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను అరెస్ట్ చేసి కోర్టుకు తీసుకురావాల్సిందిగా డీజీపీని ఆదేశిస్తామని పేర్కొంది. సాయంత్రంలోపు రంగనాథ్ విచారణకు హాజరవుతారని హైడ్రా తరఫు న్యాయవాది కోర్టును కోరడంతో అంగీకరించింది. ఆ మేరకు విచారణకు రంగనాథ్ హాజరయ్యారు.

**హైడ్రాపై తీవ్ర ఆగ్రహం**

ఇటీవల హైకోర్టులో జరిగిన విచారణల సందర్భంగా హైడ్రా తరఫున అడ్వకేట్ జనరల్ సుదర్శన్ రెడ్డి వాదనలు వినిపించారు. సర్వే నెంబర్ 1,2 లలో ఉన్న 40 ఎకరాల భూమిలో హైడ్రా జోక్యం చేసుకోదని ఏజీ కోర్టుకు హామీ ఇచ్చారు. పూర్తి వివరాలతో అఫిడవిట్ ను దాఖలు చేయాలంటూ హైకోర్టు విచారణను 23వ తేదీకి వాయిదా వేసింది. ఏజీ హామీ ఇచ్చినప్పటికీ హైడ్రా అధికారులు యంత్రాలతో మరోసారి తమ స్థలంలోకి వచ్చారని శాంతాశ్రీరామ్ కంపెనీ హైకోర్టులో మధ్యంతర పిటిషన్ దాఖలు చేసింది.ఈ పిటిషన్‌పై విచారణ సందర్భంగా హైకోర్టు హైడ్రాపై మరోసారి ఆగ్రహం వ్యక్తం చేసింది. ప్రైవేట్ స్థలానికి ఆర్మీ బ్రిగేడియర్ స్థాయి అధికారి పర్యవేక్షణలో 10 మంది ఆర్మీ జవాన్లతో రక్షణ కల్పించాలని ఆదేశించింది. ఈ మేరకు చర్యలు చేపట్టాలని రిజిస్ట్రార్ జనరల్‌ను ఆదేశించింది. అఫిడవిట్ దాఖలు చేస్తామని ఉత్తర్వులను వాయిదా వేయాలని అడ్వకేట్ జనరల్(ఏజీ) కోరగా ఆ మేరకు కోర్టు ఒకరోజు గడువు ఇచ్చింది. 24వ తేదీ ఏజీ ప్రాథమిక అఫిడవిట్‌ను దాఖలు చేశారు.ప్రైవేట్ భూమిలో జోక్యం చేసుకోలేదని, పూర్తి స్థాయి అఫిడవిట్‌ను దాఖలు చేయడానికి సమయం కోరడంతో అంగీకరించిన హైకోర్టు హైడ్రా కమిషనర్ రంగనాథ్ క్షమాపణలతో అఫిడవిట్ దాఖలు చేయాలని ఆదేశించింది. దీంతో రంగనాథ్ అఫిడవిట్‌ను దాఖలు చేశారు. హైకోర్టుకు క్షమాపణలు చెప్పిన రంగనాథ్ కోర్టులు, న్యాయవ్యవస్థపై తనకు ఎంతో గౌరవం ఉందని కొద్దిరోజుల క్రితం సమర్పించిన అఫిడవిట్‌లో పేర్కొన్నారు. లోతుకుంటలోని సర్వే నెం–1,2లలో ఉన్న 40 ఎకరాల భూమిలోకి హైడ్రా వెళ్లలేదని, పిటిషనర్ అవాస్తవాలు పేర్కొన్నారన్నారు. కోర్టు ధిక్కరణ పిటిషన్‌పై ఉత్తర్వులు వెలువరించిన హైకోర్టు కమిషనర్ రంగనాథ్‌ను ఆ పదవి నుంచి తొలగించాలని ఆదేశించింది.

# టామ్‌కాం సేవలను మరింతగా బలోపేతం చేయాలి : సీఎం రేవంత్‌రెడ్డి

మొదటి పేజీ రువాయి

ప్రకటించారు. పాస్‌పోర్టు నుంచి ఉద్యోగం వరకు సేవలు అందజేయాలని సూచించారు.

**విదేశీ ఉద్యోగాల కోసం ఒప్పందాలు..**

విదేశీ ఉద్యోగాల కోసం టామ్‌కాం – మ్యాన్‌పవర్ కంపెనీలతో ఒప్పందాలు చేసుకున్నట్లు తెలిపారు. ఈరోజు (శుక్రవారం) మర్రిచెన్నారెడ్డి మానవ వనరుల కేంద్రంలో ఉపాధి, నైపుణ్యాలపై శక్తి శాఖ అధికారులతో సీఎం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంబంధిత అధికారులకు పలు అంశాలపై కీలక ఆదేశాలు జారీ చేశారు. ఈ సమీక్షకు కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి, ఉన్నతాధికారులు హాజరయ్యారు.

**విదేశాలకు వెళ్లే కార్మికుల పూర్తి వివరాలు నమోదు చేయాలి..**

విదేశాలకు వెళ్లే కార్మికుల పూర్తి వివరాలను నమోదు చేయాలని సీఎం మార్గనిర్దేశం చేశారు. టామ్‌కాంకు మాజీ ఐఎఫ్ఎస్ అధికారిని సీఈవోగా నియమిస్తామని అన్నారు. డ్రైవింగ్, విదేశీ ఉద్యోగాలకు ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు. యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీలో రీసెర్చ్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. జర్మన్, జపనీస్, కొరియన్ సహా విదేశీ భాషలకు ప్రత్యేక విభాగం ఏర్పాటు చేస్తామని వెల్లడించారు.

**స్కాలర్‌షిప్‌లపై అధ్యయనం చేయాలి..**

బ్లూ కాలర్ ఉద్యోగ శిక్షణార్థులకు స్కాలర్‌షిప్‌లపై అధ్యయనం చేయాలని సీఎం సూచించారు. ఇంజినీరింగ్, ఐటీఐ, పాలిటెక్నిక్ విద్యార్థులకు ఇంటర్న్‌షిప్‌లు ఏర్పాటు చేస్తామని స్పష్టం చేశారు. ఏటీసీల్లో ఈవీ సర్వీసింగ్, డ్రోన్ టెక్నాలజీ కోర్సులు ప్రవేశపెడతామని చెప్పుకొచ్చారు. నర్సుల గ్లోబల్ డిమాండ్‌కు అనుగుణంగా కొత్త నర్సింగ్ కళాశాలలు ఏర్పాటు చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.



# ఈవీ, డ్రోన్ టెక్నాలజీ కోర్సులు

మొదటి పేజీ రువాయి

అభిప్రాయపడ్డారు. భవిష్యత్‌లో చేయబోయే ఉద్యోగానికి సంబంధించిన నైపుణ్యాలు నేర్చుకుంటారన్నారు. దేశీయంగానూ, విదేశాల్లోనూ నర్సుల సేవలకు భారీ డిమాండ్ ఉందని ముఖ్యమంత్రి గారు వివరించారు. పలు అభివృద్ధి చెందిన దేశాల్లో వృద్ధుల సంఖ్య పెరుగుతుండడంతో ఇంటికో నర్సు డిమాండ్ ఉందన్నారు. పెరుగుతున్న డిమాండ్‌కు అనుగుణంగా నర్సింగ్ కళాశాలలకు అనుమతులు ఇస్తున్నట్లు తెలిపారు.

స్కిల్ వర్సిటీలో రీసెర్చ్ సెంటర్ ఏర్పాటు చేయాలి యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీలో నూతన ఆవిష్కరణలకు అవసరమైనటువంటి రీసెర్చ్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని ఆయన ఆదేశించారు. జర్మన్, జపనీస్, కొరియన్, చైనీస్, రష్యన్ తదితర భాషలు నేర్చుకునేందుకు వీలుగా స్కిల్ యూనివర్సిటీలో ప్రత్యేక విభాగాన్ని నెలకొల్పాలన్నారు. ఫారిన్ లాంగ్వేజెస్ నేర్పేందుకు స్థానికంగా ఆ భాషలో పట్టున్న వారితో పాటు ఆయా దేశాలకు చెందిన శిక్షకులను రప్పించాలని ఆయన సూచించారు. ఉన్నత విద్యకు వెళ్లే విద్యార్థులకు ఓవర్సీస్ స్కాలర్‌షిప్‌లు ఇచ్చినట్లుగానే బ్లూ కాలర్ జాబ్‌లకు శిక్షణ పొందే వారందరికీ స్కాలర్‌షిప్‌లు ఇచ్చే అంశంపై అధ్యయనం చేయాలని ఆదేశించారు.ఏటీసీల్లో(అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ సెంటర్ల)లో ఈవీ సర్వీసులకు సంబంధించిన కోర్సులు, డ్రోన్ టెక్నాలజీ కోర్సులు ప్రవేశపెట్టాలని రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఈవీల వాడకం విపరీతంగా పెరిగిన నేపథ్యంలో వాటి సర్వీసింగ్ చేయగలిగిన వారు అవసరమన్నారు. వ్యవసాయంలో డ్రోన్ల వినియోగం భారీగా పెరుగుతున్నందున డ్రోన్ టెక్నాలజీ కోర్సు ఉండాలని ఆయన సూచించారు.

# ఈ-కేవైసీ గడువు పెంపు

మొదటి పేజీ రువాయి

రేషన్ కార్డుదారులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఊరట కల్పించింది. ఈ–కేవైసీ పూర్తి చేసుకునేందుకు ఇచ్చిన గడువును ఆగస్టు 31 వరకు పొడిగించింది. గడువు శుక్రవారంతో ముగియనున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకుంది. వివిధ కారణాలతో ఇప్పటివరకు ఈ–కేవైసీ పూర్తి చేయలేకపోయిన వారికి ఇది పెద్ద ఊరటగా మారింది.మొదట ఈ వెసులుబాటును జీహెచ్ఎంసీ పరిధిలోని లబ్ధిదారులకు మాత్రమే ఇవ్వాలని నిర్ణయించారు. అయితే ఇతర జిల్లాల నుంచి వచ్చిన విజ్ఞప్తులను పరిగణనలోకి తీసుకుని రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయాలని నిర్ణయించారు. రాష్ట్రంలో కొనసాగుతున్న 'స్మార్ట్' ప్రక్రియ, పలు జిల్లాల్లో కురుస్తున్న భారీ వర్షాల వల్ల ప్రజలు ఇబ్బందులు పడకుండా ఉండేందుకే గడువు పెంచినట్లు అధికారులు తెలిపారు.మరోవైపు రేషన్ కార్డుదారులకు మరో శుభవార్త కూడా ఉంది. ఈ–కేవైసీ పూర్తయిందా లేదా అన్న దానితో సంబంధం లేకుండా శనివారం నుంచి మూడు నెలల బియ్యం, ఇతర రేషన్ సరకులను ఒకేసారి పంపిణీ చేయనున్నారు. సూపర్ ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో పెట్టుకుని కేంద్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఇంకా ఈ–కేవైసీ పూర్తి చేయని వారు ఆగస్టు 31లోపు సమీప రేషన్ దుకాణంలో ప్రక్రియ పూర్తి చేసుకోవచ్చని అధికారులు స్పష్టం చేశారు.

# భోగాపురం..ఆధునిక ఎయిర్ పోర్టుకు ప్రతిరూపం

మొదటి పేజీ రువాయి

విమానాశ్రయానికి సంబంధించిన ఆకర్షణీయమైన ఫొటోలను కూడా ప్రధాని పంచుకున్నారు.భోగాపురం విమానాశ్రయం ఒక ఆధునిక, భవిష్యత్ అవసరాలకు తగ్గట్టుగా నిర్మించిన ప్రాజెక్టు అని ప్రధాని అభివర్ణించారు. కనెక్టివిటీ, వాణిజ్యం, పర్యాటకాన్ని ఇది గణనీయంగా పెంచుతుందని తెలిపారు. సుస్థిరత, ఇంధన సామర్థ్య సూత్రాలను పాటిస్తూ ఈ విమానాశ్రయాన్ని నిర్మించారని పేర్కొన్నారు.వీటితో పాటు మరిన్ని కొత్త ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టనున్నట్లు మోదీ వెల్లడించారు. భోగాపురంలో ఏఎస్ఐపి సెమీకండక్టర్ ప్రాజెక్టుకు, అలాగే కర్నూలు–×ం పునరుత్పాదక ఇంధన జోన్ (ఆర్ఈజెడ్) మొదటి దశ అనుసంధానానికి సంబంధించిన ట్రాన్స్‌మిషన్ వ్యవస్థకు శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు.

ఇదే క్రమంలో, రాష్ట్రంలో పూర్తయిన కొన్ని కీలకమైన రహదారి ప్రాజెక్టులను జాతికి అంకితం చేయనున్నట్లు ప్రధాని తన పోస్టులో వివరించారు. వీటిలో ఎన్ హెచ్–365బీజీ పరిధిలోని రేచెర్ల – గురువాయిగూడెం మధ్య నాలుగు వరుసల రహదారి, గురువాయిగూడెం – దేవరపల్లి సెక్షన్, ఎన్ హెచ్–67పై నిర్మించిన తాడిపత్రి బైపాస్ ఉన్నాయని పేర్కొన్నారు. విమానయానం, సాంకేతికత, పునరుత్పాదక ఇంధనం, రహదారి రవాణా వంటి కీలక రంగాల్లో చేపడుతున్న ఈ ప్రాజెక్టులు ఆంధ్రప్రదేశ్ మౌలిక సదుపాయాలను బలోపేతం చేసి, రాష్ట్ర సమగ్రాభివృద్ధికి బాటలు వేస్తాయని ప్రధాని ఆశాభావం వ్యక్తం చేశారు.

# కర్ణాటకకు రావొద్దు..

మొదటి పేజీ రువాయి

వివరించినట్లు చెప్పారు.విధానసౌధలో ఉప ముఖ్యమంత్రి జి.పరమేశ్వర, జలవనరుల శాఖ మంత్రి రామలింగారెడ్డితో కలిసి మీడియాతో మాట్లాడిన శివకుమార్.. అతిథులు వచ్చినప్పుడు ఆహ్వానించడం తమ బాధ్యతని అన్నారు. అయితే ప్రస్తుత పరిస్థితుల్లో ఎవరైనా నిరసనలు చేపట్టినా, నినాదాలు చేసినా ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడతాయని పేర్కొన్నారు. అందుకే కొంతకాలం ఓపిక పట్టాలని విజయ్‌ను కోరినట్లు వెల్లడించారు.ఆదివారం జరగనున్న అఖిలపక్ష సమావేశం తర్వాత తదుపరి కార్యాచరణపై నిర్ణయం తీసుకుంటామని శివకుమార్ తెలిపారు. ప్రస్తుతం కర్ణాటకలో వర్షాలు కురుస్తుండటంతో జలాశయాల్లోకి నీటి ప్రవాహం పెరుగుతోందని, దీంతో చర్చలకు అనుకూల వాతావరణం ఏర్పడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రెండు రాష్ట్రాల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని కొత్త తేదీ ఖరారు చేస్తామని చెప్పారు.మేకెదాటు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ ప్రాజెక్టు కర్ణాటకతో పాటు తమిళనాడుకూ ప్రయోజనం చేకూరుస్తుందని శివకుమార్ అన్నారు. ఈ ప్రాజెక్టు తాగునీరు, విద్యుత్ ఉత్పత్తి కోసమేనని, సాగునీటి అవసరాలకు కాదని స్పష్టం చేశారు. కావేరి జలాల పంపిణీపై సుప్రీంకోర్టు తీర్పును గౌరవిస్తామని, అయితే వర్షాభావం, నీటి లభ్యత వంటి ప్రస్తుత పరిస్థితులను కూడా పరిగణనలోకి తీసుకోవాలని పేర్కొన్నారు.



# విద్యార్థుల స్కాలర్‌షిప్ నిధులను దారి మళ్లించిన రేవంత్ సర్కార్...

**ఆడబిడ్డల శానిటరీ ప్యాడ్ల సొమ్ము మాయం**


**విద్యా మాఫియా కేటుగాళ్లు పల్లా,కొమ్మూరి**

**అమెరికా తరహాలో విద్య అందిస్తాం**

**కత్తెర గుర్తుతో చరిత్ర మారుస్తాం**

**సీతక్క కంటే సీనియర్ మావోయిస్టు మా వనజక్క**

**డాక్టర్ భిక్షపతిని తొలి ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించిన మల్లన్న.**







**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూలై 31, తెలంగాణ బ్యూరో :** జనగామ జిల్లా కేంద్రంలోనీ జూబ్లీ ఫంక్షన్ హాల్ లో జిల్లా అధ్యక్షులు కట్ల సదానందం, యూత్ ప్రెసిడెంట్ పిట్టల సురేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన బీసీ బహుజన విద్యార్థి యువ చైతన్య సభకు ముఖ్య అతిథిగా విచ్చేసిన తెలంగాణ రాజ్యాధికార పార్టీ అధినేత ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న తన శైలిలో అధికార, ప్రతిపక్ష పార్టీలపై నిప్పులు చెరిగారు. విద్యార్థుల సమస్యలు, పెండింగ్ ఫీజు రియంబర్స్మెంట్, విద్యా వ్యాపారం చేస్తున్న రాజకీయ నాయకుల తీరుపై ఆయన మండిపడ్డారు.

**ఆడబిడ్డల సొమ్ము దొంగతనం.. 74 కోట్లు ఏమైనట్టు?**

గత కేసీఆర్ ప్రభుత్వం తొమ్మిది, పదో తరగతి చదువుతున్న ఆడబిడ్డల కోసం ప్రవేశపెట్టిన శానిటైజేషన్ స్కీమ్ పథకాన్ని ప్రస్తుత ప్రభుత్వం అటకెక్కించిందని మల్లన్న మండిపడ్డారు. "ఆడబిడ్డల శానిటరీ ప్యాడ్ల కోసం కేటాయించిన 74 కోట్ల రూపాయలను దొంగతనంగా ఎత్తుకపోయి తిన్నారని ధ్వజమెత్తారు.

**స్కాలర్‌షిప్ నిధుల దారి మళ్ళింపు..**

రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులకు అందాల్సిన 1900 కోట్ల రూపాయల స్కాలర్‌షిప్ నిధులలో కేవలం 300 కోట్లు మాత్రమే విడుదల చేసి, మిగిలిన సొమ్మును రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇతర పనులకు దారి మళ్లించిందని మల్లన్న ఆరోపించారు. "పోలీసు శాఖలోని ఒక కుక్క ఆహారం కోసం నెలకు 16,000 రూపాయలు ఖర్చు చేస్తున్న ప్రభుత్వం, హాస్టల్‌లో ఉండి చదువుకునే పేద బిడ్డలకు కనీసం 2000 రూపాయలు కూడా ఇవ్వడం లేదు. కుక్కకు ఉన్న విలువ కూడా విద్యార్థులకు లేదా?" అని ఆయన సూటిగా ప్రశ్నించారు.శ్రీ చైతన్య, నారాయణ వంటి విద్యా సంస్థలు ఇతర రాష్ట్రాల విద్యార్థుల ర్యాంకులను తమవిగా చూపించుకుంటూ తప్పుదోవ పట్టించే ప్రకటనలతో తల్లిదండ్రులను మోసం చేస్తున్నాయని ధ్వజమెత్తారు

**చట్టాల అమలులో విఫలం:**

'రైట్ టు ఎడ్యుకేషన్ యాక్ట్ 2009' ప్రకారం ప్రైవేట్ పాఠశాలల్లో పేద విద్యార్థులకు దక్కాల్సిన 25% ఉచిత సీట్ల గురించి ప్రభుత్వం ప్రజలకు చెప్పడం లేదని, ఆ చట్టాన్ని అమలు చేయడం లేదని ఆయన ఆరోపించారు. భారతదేశంలో విద్య కోసం అత్యంత తక్కువ ఖర్చు చేస్తున్న రాష్ట్రం తెలంగాణ అని, దీనివల్ల రాష్ట్ర విద్యా వ్యవస్థ దేశంలోనే 18వ స్థానానికి పడిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు.కేవలం కార్పొరేట్ కాలేజీల్లో సీట్లు నింపడం కోసమే పదవ తరగతిలో అందరినీ పాస్ చేస్తున్నారని, ఇది విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడటమేనని ఆయన పేర్కొన్నారు

**రాజకీయ నాయకుల ద్వంద్వ నీతి:**

మాజీ ముఖ్యమంత్రి మనవడు అమెరికాలో చదువుకుంటుంటే, పేద విద్యార్థులు మాత్రం కూలిపోయే స్థితిలో ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్నారని ఆయన ఎద్దేవా చేశారు.

**విద్యా వ్యాపారం.. పల్లా, కొమ్మూరిలపై ఆగ్రహం**

జనగామ నియోజకవర్గంలో రాజకీయం విద్యా వ్యాపారవేత్తల చేతుల్లో బందీ అయిందని మల్లన్న విమర్శించారు. ఒకవైపు అనురాగ్ యూనివర్సిటీ యజమాని పల్లా రాజేశ్వర్ రెడ్డి, మరోవైపు కొమ్మూరి ఇన్స్టిట్యూట్ అధినేత కొమ్మూరి ప్రతాప్ రెడ్డి విద్యను అమ్ముకుంటూ కోట్ల రూపాయలు గడిస్తున్నారని ధ్వజమెత్తారు. "1,26,000 బీసీ ఓట్లున్న జనగామలో కేవలం 11,000 ఓట్లున్న రెడ్డి సామాజిక వర్గానికి చెందిన వీళ్ళే ఎందుకు ఏలాలి? ఈ విద్యా వ్యాపారుల నుంచి జనగామను రక్షించుకోవాల్సిన అవసరం ఉంది" అని ఆయన పిలుపునిచ్చారు.

**తొలి ఎమ్మెల్యే అభ్యర్థిగా డాక్టర్ భిక్షపతి ప్రకటన**

ఈ సందర్భంగా తెలంగాణ రాజ్యాధికార పార్టీ తరపున జనగామ నియోజకవర్గ మొట్టమొదటి ఎమ్మెల్యే అభ్యర్థిగా డాక్టర్ భిక్షపతిని తీన్మార్ మల్లన్న అధికారికంగా ప్రకటించారు. 20 ఏళ్ల పాటు సైన్యంలో దేశానికి సేవ చేసి వచ్చిన ముదిరాజ్ బిడ్డ భిక్షపతిని గెలిపించుకోవాలని, అప్పుడే జనగామలో పేద బిడ్డలకు ఉచిత విద్య, మెరుగైన భవిష్యత్తు అందుతుందని ఆయన పేర్కొన్నారు.

**ఉచిత విద్యే లక్ష్యం.. కత్తెర గుర్తుతో చరిత్ర మారుద్దాం!**

అమెరికా వంటి దేశాల్లో 12వ తరగతి వరకు ఉచిత విద్య అందుతోందని, తెలంగాణలో కూడా ప్రతి ప్రైవేట్ కాలేజీలో ఫ్రీ ఎడ్యుకేషన్ అందే వరకు టిఆర్పి పోరాడుతుందని మల్లన్న స్పష్టం చేశారు. రైట్ టు ఎడ్యుకేషన్ యాక్ట్ ప్రకారం దక్కాల్సిన 25% ఉచిత సీట్ల గురించి ఏ ప్రభుత్వం మాట్లాడటం లేదని ఆయన విమర్శించారు. మన తలరాతలు మారాలంటే 'కత్తెర' గుర్తుపై ఓటు వేసి రాజ్యాధికారం సాధించాలని పిలుపునిచ్చారు.

**పార్టీ జెండా ఆవిష్కరణ**

సమావేశం అనంతరం తెలంగాణ రాజ్యాధికార పార్టీ అధినేత, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న స్థానిక 5 మరియు 13వ వార్డుల్లో పార్టీ జెండాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులు, స్థానిక నాయకులు మల్లన్న గారికి ఘన స్వాగతం పలికారు. ప్రజలను ఉద్దేశించి మల్లన్న మాట్లాడుతూ, తెలంగాణ రాజ్యాధికార పార్టీ సిద్ధాంతాలను ప్రతి ఇంటికి తీసుకెళ్లి పార్టీని గ్రామస్థాయి నుంచి బలోపేతం చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎల్లబోయిన ఓదెలు యాదవ్, మహిళా అధ్యక్షురాలు పటేల్ వనజ, క్రమశిక్షణ కమిటీ చైర్మన్ బందారపు నర్సయ్య గౌడ్, మహిళా క్రమశిక్షణ కమిటీ ఛైర్మన్ పుష్ప లీలా, మైనారిటీ అధ్యక్షులు సల్మాన్, యూత్ అధ్యక్షులు చంద్రశేఖర్, కార్యదర్శి ప్రవీణ్ రాజ్, సహాయక కార్యదర్శి గిరగాని బిక్షపతి గౌడ్, యూత్ జనరల్ సెక్రటరీలు వీరమల్లు అనిల్, పోలు రాజు, మహిళా ఉపాధ్యక్షురాలు చేసుకూరి మౌనిక యాదవ్, రాష్ట్ర నాయకులు సుతారపు రంగన్న, స్టేట్ ఆఫీసు కోఆర్డినేటర్ లింగం యాదవ్, సంయుక్త కార్యదర్శి గడ్డం కృష్ణ, జిల్లా ఉపాధ్యక్షులు రేణుగుంట్ల మురళి, బోడ రమేష్ నేత, మైనారిటీ జిల్లా అధ్యక్షులు యాకుబ్ పాషా, జిల్లా మహిళా అధ్యక్షురాలు దండు రాణి, హన్మకొండ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పూజారి సత్యనారాయణ, నియోజక వర్గ ఇంచార్జి సీసా శ్రీధర్ గౌడ్, యూత్ ఉపాధ్యక్షులు యమంకి విజయ్,యూత్ ప్రధాన కార్యదర్శి వంశీ, కార్యదర్శి గంగరాజు, విద్యార్థి విభాగం అధ్యక్షులు వెంపటి అజయ్, పట్టణ అధ్యక్షులు గుజ్జుక రాజు, పట్టణ యూత్ అధ్యక్షులు పానుగంటి కృష్ణ, యూత్ కార్యదర్శి ఎనగందుల ఉమేష్, మైనారిటీ పట్టణ అధ్యక్షులు ఎండి పాషా, జలీల్ పాషా, సల్మాన్,బానుచందర్, తదితరులు పాల్గొన్నారు.

## ఆలేరులో కామ్రేడ్ లింగన్న 7వ వర్ధంతి సభ



**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూలై 31, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** సీపీఐ (ఎం.ఎల్) న్యూడెమోక్రసీ తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యులు, విప్లవ ప్రతిఘటనోద్యమ దళపతి, ఆదివాసీల అత్యంత ప్రియతమ నాయకుడు కామ్రేడ్ పూనెమ్ లింగన్న ను అప్పటి హంతక కేసీఆర్ ప్రభుత్వం 2019 జూలై 31న ప్రాణాలతో పట్టుకొని తీవ్ర చిత్ర హింసలకు గురి చేసి ఎన్ కౌంటర్ పేరుతో కాల్చి చంపిందని, కామ్రేడ్ లింగన్న బూటకపు ఎన్ కౌంటర్ ను జీర్ణించుకోలేని ఆదివాసీ ప్రజలు పోలీస్ ల దుర్మార్గపు చర్యను ఖండిస్తూ చేతికి దొరికిన రాళ్ళు, రప్పలు అందుకొని పోలీస్ లను ఉరికించారని, కామ్రేడ్ లింగన్న అమరత్వం పొందినప్పటికీ ప్రజలలో విప్లవ పార్టీ పట్ల విశ్వాసం, చైతన్యం, పట్టుదల మరింత పెరిగిందని సీపీఐ ఎం.ఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఆర్.జనార్ధన్ అన్నారు. జూలై 31న కామ్రేడ్ లింగన్న అమరత్వం పొందిన రోజును స్మరించుకుంటూ ఆయన 7వ వర్ధంతి సభ ఆలేరులో నిర్వహించారు. ఈ సందర్భంగా జనార్ధన్ మాట్లాడుతూ, కామ్రేడ్ పూనెమ్ లింగన్న సీపీఐ ఎం.ఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకునిగా, అజ్ఞాత దళ కమాండర్ గా, నేతగా ఆదివాసీ, గిరిజన గ్రామాల్లో ఆ ప్రజలకు అండగా నిలబడడమే కాకుండా లక్షలాది ఎకరాల పోడు భూములను ప్రజలు స్వాదీనం చేదుకునే విధంగా ఆదర్శవంతమైన పోరాటాలను నిర్మించిన విప్లవ ప్రజా నాయకుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సీపీఐ ఎం.ఎల్ న్యూడెమోక్రసీ డివిజన్ కార్యదర్శి ఇక్కిరి సహదేవ్, ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షులు కల్లెపు అడివయ్య, పీఓడబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలు ఆర్.సీత, ఐఎఫ్టియు జిల్లా అధ్యక్షులు పద్మ సుదర్శన్, ఏఐకెఎంఎస్ జిల్లా ఉపాధ్యక్షులు చిర బోయిన రాజయ్య, మామిడాల బాల మల్లేష్, పీవైఎల్ జిల్లా అద్యక్ష, ప్రధాన కార్యదర్శులు మారుజోడు సిద్దేశ్వర్, సాదుల శ్రీకాంత్, ప్రజా సంఘాల నాయకులు ఆర్.ఉదయ్, పున్నపురెడ్డి రాఘవ రెడ్డి, మాలోత్ మోతీలాల్, చిర బోయిన కొమురయ్య, కట్టా సమరసింహారెడ్డి, గడ్డం మంకయ్య, యెర్ర మల్లేష్, తమ్మడి అంజయ్య, పంజాల మురళి, యెలగందుల సిద్దులు, చిర బోయిన బాలయ్య, కొమ్మిడి గోపాల్ రెడ్డి, దార యాదగిరి, కుర్రి మార్కండేయ, యెర్రబెల్లి అయిలయ్య, ఊరడి రామ చంద్రు, తలారి వెంకటేష్, కడకంచి సత్తయ్య, శిఖిలం వెంకటేష్, ఉచ్చంతల మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## సిఎం రేవంత్ రెడ్డిని కలిసిన ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, మాజీ ఎమ్మెల్సీ ఎగ్గే మల్లేశం

**కురుమ కార్పొరేషన్ ఏర్పాటుపై కీలక చర్చ**

**ఆగస్టు 15వ తేదీలోపు కురుమ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేస్తాం : సిఎం హామీ**

**కురుమ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేస్తామని రేవంత్ రెడ్డి హామీ ఇచ్చినట్లు**

**వెల్లడించిన ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య**



**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూలై 31, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** హైదరాబాద్‌లో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, కురుమ సంఘం రాష్ట్ర చైర్మన్, మాజీ ఎమ్మెల్సీ ఎగ్గే మల్లేశం మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి శాలువాతో ఘనంగా సన్మానం చేసి, కురుమ సామాజిక వర్గానికి సంబంధించిన పలు అంశాలపై విస్తృతంగా చర్చించారు. ముఖ్యంగా రాష్ట్రంలో కురుమ కార్పొరేషన్ ఏర్పాటు అంశాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్లగా ఆగస్టు 15వ తేదీలోపు కురుమ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీ ఇచ్చినట్లు ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య తెలిపారు.ఈ నిర్ణయం కురుమ సామాజిక వర్గం ఎన్నో సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న ఆకాంక్షకు నెరవేర్పుగా నిలుస్తుందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీ పట్ల కురుమ సమాజంలో ఆనందం వ్యక్తమవుతోందని ఆయన పేర్కొన్నారు.ఈ సందర్భంగా యావత్ కురుమ కులస్తుల తరపున ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, కురుమ సంఘం రాష్ట్ర చైర్మన్ ఎగ్గే మల్లేశం ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.కురుమల సంక్షేమం, సామాజిక-ఆర్థిక అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, కార్పొరేషన్ ఏర్పాటు ద్వారా ఆ వర్గానికి మరిన్ని సంక్షేమ కార్యక్రమాలు చేరువయ్యే అవకాశం ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

## ప్రధాని మోదీ పాకిస్తాన్ వెళ్తారా: షెహబాజ్ షరీఫ్ నుంచి ఆహ్వానం- లైన్ క్లియర్?



**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూలై 31 :** భారత్- పాకిస్తాన్ దౌత్య సంబంధాల్లో అనూహ్య మలుపు చోటు చేసుకోబోతోందా?, అక్కడ జరగబోయే ఓ అత్యున్నత సమ్మిట్ కు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హాజరు కానున్నారా?, దీనికి సంబంధించి ఆ దేశ ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్ నుంచి ఆహ్వానం అందిందా? అనే ప్రశ్నలకు అవుననే సమాధానమే వినిపిస్తోంది. ఈ విషయాన్ని అటు పాకిస్తాన్ విదేశాంగ మంత్రిత్వ శాఖ సైతం అధికారికంగా ప్రకటించింది.ఇస్లామాబాద్ వేదికగా జరిగే షాంఘై కోఆపరేషన్ ఆర్గనైజేషన్ శిఖరాగ్ర సదస్సుకు ప్రధాని మోదీని ఆహ్వానించనున్నట్లు పాకిస్తాన్ అధికారికంగా ప్రకటించింది. ఇస్లామాబాద్‌లో జరిగే ఈ ఉన్నత స్థాయి సమావేశానికి ఎస్సీఓలోని సభ్య దేశాల ప్రధానమంత్రులు, అధ్యక్షులను ఆహ్వానించడం ఆతిథ్య దేశంగా తమ ప్రథమ బాధ్యతని విదేశాంగ మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. ఆయా దేశాల ప్రభుత్వ, దేశాధినేతల స్థాయి సమావేశం కావడం వల్ల ప్రోటోకాల్ పాటిస్తామని తేల్చి చెప్పింది.ఎస్సీఓ సమ్మిట్ భేటీపై పాకిస్తాన్ విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి ప్రెస్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వివరాలను వెల్లడించారు. అంతర్జాతీయ ప్రోటోకాల్ ప్రకారం సభ్యత్వ దేశాలన్నిటికీ సదస్సు కంటే ముందే అధికారిక ఆహ్వానాలు పంపాల్సి ఉందని పేర్కొన్నారు. దీనికి లోబడి ప్రధాని మోదీని సైతం ఆహ్వానం అందుతుందని వివరించారు. ఈ ప్రతిష్టాత్మక సదస్సులో సభ్య దేశాల ప్రభుత్వాధినేతలు, అధ్యక్షులు పాల్గొనేలా ఏర్పాట్లు చేస్తోన్నట్లు కూడా తెలిపారు.యురేసియా రీజియన్ లో ఎస్సీఓ భేటీకి ప్రాధాన్యత ఉందని, ఈ భేటీ వల్ల సభ్య దేశాల మధ్య ప్రాంతీయ రక్షణ, ఆర్థిక, దౌత్య సంబంధాలు బలపడతాయని వ్యాఖ్యానించారు. ఈ భేటీకి ప్రధాని మోదీ స్వయంగా హాజరవుతారా, లేదా అనేది తేలాల్సి ఉందని, ఇది భారత్ తీసుకునే నిర్ణయం మీదే ఆధారపడి ఉందని విలేకరులు అడిగిన ఓ ప్రశ్నకు బదులిచ్చారు. సభ్య దేశాధినేతలు హాజరవుతారని ఆశిస్తోన్నట్లు పేర్కొన్నారు.షాంఘై కోఆపరేషన్ ఆర్గనైజేషన్ లో భారత్, పాకిస్తాన్‌తో పాటు చైనా, రష్యా, కజకిస్తాన్, కిర్గిజిస్తాన్, తజకిస్తాన్, ఉజ్బెకిస్తాన్, ఇరాన్, బెలారస్ కలిపి మొత్తం 10 సభ్య దేశాలకు సభ్యత్వం ఉంది. యురేసియా రీజియన్ లో శాంతి, భద్రత, స్థిరత్వం, ఆర్థిక అభివృద్ధిని మరింత ప్రోత్సహించాలనే ఉద్దేశంతో 2001 జూన్ 15న బీజింగ్‌లో ఈ ఎస్సీఓ ఏర్పాటైంది.ఎస్సీఓ సమాఖ్య అత్యున్నత నిర్ణాయక విభాగం కౌన్సిల్ ఆఫ్ హెడ్స్ ఆఫ్ స్టేట్. దీని అధ్యక్ష పదవి ప్రతి సంవత్సరం ఆల్ఫాబెటికల్ క్రమంలో సభ్య దేశాల మధ్య మారుతూ వస్తుంటుంది. ఇందులో భాగంగా వచ్చే ఏడాది ఈ శిఖరాగ్ర సదస్సు నిర్వహించే బాధ్యతలను పాకిస్తాన్ దక్కించుకుంది. భారత్- పాక్ మధ్య ద్వైపాక్షిక ఉద్రిక్తతలు ఎలా ఉన్నప్పటికీ, అంతర్జాతీయ వేదికలకు సంబంధించి భారత్‌ను ఈ సమ్మిట్ కు ఆహ్వానించాల్సి ఉంటుందా దేశానికి. గతంలో ఈ సమావేశానికి భారత్ ఆతిథ్యాన్ని ఇచ్చింది. అప్పట్లో పాకిస్తాన్ విదేశాంగ ప్రతినిధులు దీనికి హాజరయ్యారు.

## ఆలేరు రెవెన్యూ డివిజన్ గా ప్రకటించాలని సీపీఐ ధర్నా




**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూలై 31, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** ఆలేరు ను రెవెన్యూ డివిజన్ గా ప్రకటించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ శుక్రవారం రోజున ఆలేరు రెవిన్యూ డివిజన్ సాధన పోరాట కమిటీ ఆధ్వర్యంలో ఆలేరు బంద్, ధర్నా సందర్భంగా ఆలేరు లో ర్యాలీగా బయలుదేరి ధర్నాలో పాల్గొన్న సీపీఐ ఎం.ఎల్ న్యూడెమోక్రసీ శ్రేణులు

# ఇందిరమ్మ ఇండ్ల పేరుతో మంత్రులు వ్యాపారం

**కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షులు జె. రామకృష్ణ**



**జూలై 31, మహీంద్రా హిల్స్,హైదరాబాద్ పల్స్ ప్రతినిధి :**
ఇందిరమ్మ ఇండ్ల పథకం పేరుతో పేద ప్రజలతో కాంగ్రెస్ ప్రభుత్వం వ్యాపారం చేస్తోందని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షులు జె. రామకృష్ణ ఆరోపించారు. శుక్రవారం మహేంద్రహిల్స్‌లోని తన కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన రాష్ట్ర ప్రభుత్వ విధానాలు, టీమ్స్ ఆసుపత్రి, బోనాల ఉత్సవాలకు సంబంధించిన పలు అంశాలపై మాట్లాడారు.రాష్ట్ర ప్రభుత్వం సరైన అవగాహన లేకుండా అద్భుతమైన మాటలు చెబుతూ ప్రజలను మభ్యపెడుతోందని రామకృష్ణ విమర్శించారు. సర్వే నంబర్ 844/1 మల్కాజిగిరి పరిధిలో ఉండగా, అక్కడ కంటోన్మెంట్‌లో 400 ఇళ్ల నిర్మాణం ఎలా చేపడతారో ప్రభుత్వం స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు.అదేవిధంగా సర్వే నంబర్ 74కు సంబంధించి కోర్టు వివాదాలు ఉన్నాయని, ఈ అంశంపై రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే హైకోర్టులో కేసు ఓడిపోయిందని పేర్కొన్నారు. అలాంటి పరిస్థితుల్లో అక్కడ ఇళ్ల నిర్మాణాలు ఎలా చేపడతారో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రజలకు స్పష్టత ఇవ్వాలని కోరారు.

**పేద ప్రజలతో ప్రభుత్వం వ్యాపారం చేస్తుందా?**
ఇప్పటివరకు ఏ ప్రభుత్వం కూడా పేద ప్రజలతో వ్యాపారం చేయలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం ఇందిరమ్మ ఇండ్ల పేరుతో పేదలపై ఆర్థిక భారం మోపుతోందని రామకృష్ణ ఆరోపించారు.ఇందిరమ్మ ఇళ్ల పథకంలో ముందుగా రూ.10 వేల చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని, ఇల్లు మంజూరైన తర్వాత రూ.6 లక్షలు చెల్లించాల్సిన పరిస్థితి ఉందని ఆయన అన్నారు. 400 చదరపు అడుగుల నిర్మాణం, బహుళ అంతస్తుల నిర్మాణ విధానంపై ప్రభుత్వం పూర్తి వివరాలు ప్రజలకు వెల్లడించాలని డిమాండ్ చేశారు.ఇల్లు ఆమోదం వస్తె ఆరు లక్షలు ఇవ్వాల్సి ఉంటుందని పేద ప్రజలు ఆరు లక్షలు కడితే వారికి ఇచ్చే ఇల్లు సైజు 400 స్క్వేర్ ఫీట్ అందులో పది ఫ్లోర్ల నిర్మాణం చేస్తున్నారు. ఈ పది ఫ్లోర్లలో ఆరు లక్షలకు వచ్చే నెట్ ఏరియా కేవలం 4 లేదా 5 గజాలు వస్తుందని అంటే గజానికి లక్షా 50 వేలు పేద ప్రజలు కట్టాల్సిన పరిస్థితి వస్తుందని అన్నారు.
"ప్రభుత్వం పేద ప్రజలతో వ్యాపారం చేస్తోందా? భూములు అమ్ముతోందా? లేక సంక్షేమ పథకం అమలు చేస్తోందా?" అనే విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజలకు స్పష్టం చేయాలని రామకృష్ణ డిమాండ్ చేశారు.
టీమ్స్ ఆసుపత్రికి కేంద్ర ప్రభుత్వ అనుమతులు కీలకం టీమ్స్ ఆసుపత్రి నిర్మాణం విషయంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు తామంటే తామే గొప్ప అన్నట్లుగా ప్రచారం చేసుకుంటున్నాయని రామకృష్ణ విమర్శించారు. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం టీమ్స్ ఆసుపత్రి నిర్మాణానికి అనుమతులు ఇచ్చిందని ఆయన పేర్కొన్నారు.తాను కంటోన్మెంట్ బోర్డు ఉపాధ్యక్షుడిగా ఉన్న సమయంలో టీమ్స్ ఆసుపత్రి మురుగునీటి వ్యవస్థకు సంబంధించి కంటోన్మెంట్ ప్రాంతంలో సీవరేజ్ ఔట్‌లెట్‌ను అభివృద్ధి చేసి, దానిని జీహెచ్ఎంసీ ఔట్‌లెట్‌కు అనుసంధానం చేయాలనే షరతుతో అనుమతులు ఇచ్చినట్లు రామకృష్ణ గుర్తు చేశారు. కంటోన్మెంట్ ప్రజలకు ఎలాంటి నష్టం కలగకుండా అన్ని రాజకీయ పార్టీలు కలిసి సీవరేజ్ ఔట్‌లెట్ పనులను పూర్తి చేయాలని ఆయన కోరారు. సీవరేజ్ వ్యవస్థ పూర్తయిన తర్వాతే ఆసుపత్రిని ప్రారంభించేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని ఆయన పిలుపునిచ్చారు.

**బోనాల నిధుల్లో కంటోన్మెంట్‌కు అన్యాయం**
బోనాల పండుగ సందర్భంగా కంటోన్మెంట్ ప్రాంతంలోని ఆలయాలకు ప్రభుత్వం తక్కువ నిధులు కేటాయిస్తూ వివక్ష చూపుతోందని రామకృష్ణ ఆరోపించారు.సికింద్రాబాద్, సనత్‌నగర్ నియోజకవర్గాల్లోని ఆలయాలకు ఒక విధంగా, కంటోన్మెంట్ ప్రాంతంలోని ఆలయాలకు మరో విధంగా నిధులు కేటాయించడం సరికాదని అన్నారు. కంటోన్మెంట్‌లోని ఆలయాలకు రూ.15 వేల నుంచి రూ.30 వేల వరకు మాత్రమే కేటాయిస్తుండగా, ఇతర ప్రాంతాల్లోని ఆలయాలకు కనీసం లక్ష రూపాయలు ఇస్తున్నారని పేర్కొన్నారు.కంటోన్మెంట్ ప్రాంతంపై వివక్ష ఎందుకు చూపుతున్నారో ఇంచార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ సమాధానం చెప్పాలని రామకృష్ణ డిమాండ్ చేశారు.

# 400 మీటర్ల వాకింగ్ ట్రాక్‌ను ప్రారంభించిన కొత్తగూడెం ఏరియా జీఎం ఎం. షాలెం రాజు

**సింగరేణి సామాజిక బాధ్యతలో మరో ముందడుగు.**

**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూలై 31, భద్రాద్రి జిల్లా ప్రతినిధి :**
కొత్తగూడెం పట్టణంలోని రామవరం గణేష్ చమన్ వద్ద సింగరేణి కొత్తగూడెం ఏరియా ఆధ్వర్యంలో నిర్మించిన 400 మీటర్ల వాకింగ్ ట్రాక్ ను జనరల్ మేనేజర్ ఎం. షాలెం రాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని సింగరేణి సంస్థ ఈ వాకింగ్ ట్రాక్‌ను అభివృద్ధి చేసిందన్నారు. ప్రజలు ఆరోగ్యవంతమైన జీవనశైలిని అలవర్చుకోవడంలో నిత్య నడక (వాకింగ్) కీలక పాత్ర పోషిస్తుందని కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ ఎం. షాలెం రాజు




అన్నారు.ఈ ట్రాక్ ద్వారా ఉదయం, సాయంత్రం వేళల్లో స్థానిక ప్రజలు, యువత, మహిళలు, వృద్ధులు నిత్యం వాకింగ్ చేసి ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చన్నారు. ప్రజలకు ఉపయోగపడే మౌలిక సదుపాయాల కల్పనలో సింగరేణి ఎల్లప్పుడూ ముందుంటుందని, భవిష్యత్తులో కూడా ఇలాంటి అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జీఎం తో పాటు, వికెసీఎం ప్రాజెక్టు ఆఫీసర్ నరసింహరావు, ఏఐటియుసి బ్రాంచ్ కార్యదర్శి మల్లికార్జున్ రావు, ఐ.ఎన్.టి.యు.సి వైస్ ప్రెసిడెంట్ ఎండి. రజాక్, ఎస్వో టు జీఎం ఎం. గోవిందరావు, సేఫ్టీ ఆఫీసర్ మొక్కపాటి వెంకటేశ్వర్లు, ఏజీఎం (సివిల్) సి.హెచ్. రామకృష్ణ, కె. రాజారాం, ఏరియా ఇంజనీర్ వి. రామకృష్ణ, డిజిఎం (ఈఅండ్ఎం) ఏరియా వర్క్ షాప్ క్రిస్టోఫర్, ఇతర విభాగ అధికారులు, సింగరేణి ఉద్యోగులు, స్థానిక ప్రజలు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# ఎఎస్ఐ మొహమ్మద్ లతీఫ్ కు ఉద్యోగ విరమణ విడ్కోలు సన్మానం

**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూలై 31, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** యాదాద్రి భువనగిరి జిల్లా, తుర్కపల్లి మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో ఎఎస్ఐ గా విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ పొందిన మొహమ్మద్ లతీఫ్ కి స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు ఘనంగా సన్మానం కార్యక్రమం నిర్వహించారు. ?ఈ సందర్భంగా గుజ్జవాణి కుంట తండా సర్పంచ్ గుగులోత్ దూప్ సింగ్ నాయక్ మాట్లాడుతూ... గత ఆరేడు సంవత్సరాలుగా తుర్కపల్లి మండలంలో ఏఎస్ఐ లతీఫ్ అందించిన సేవలు ఎంతో ప్రశంసనీయమైనవని కొనియాడారు. మండలాన్ని అన్ని విధాలుగా శాంతిభద్రతల పరంగా కాపాడుతూ, ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ విశేష సేవలు అందించారని తెలిపారు. ఐదారేళ్లుగా తమతో ఎంతో ఆత్మీయంగా మెలిగిన అధికారి రిటైర్ కావడం కొంత బాధాకరమైనప్పటికీ, ఆయన శేష జీవితం ఆయురారోగ్యాలతో, సంతోషంగా సాగాలని ఆకాంక్షించారు. అనంతరం లతీఫ్ ని శాలువా, పూలమాలలతో సత్కరించి వీడ్కోలు పలికారు. ?ఈ కార్యక్రమంలో గుజ్జవాణి కుంట తండా సర్పంచ్ గుగులోత్ దూప్ సింగ్ నాయక్, వేల్పుపల్లి కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు



జేరిపోతుల నరేందర్, వెల్పుపల్లి ఉపసర్పంచ్ ఏనుగు సిద్ధులు, తదితరులు పాల్గొన్నారు.

# రేవంత్ ఒత్తిడిలో ఉన్నారు.. రాహుల్ చెప్పినదానికంతా తలాడిస్తున్నారు : బీజేపీ ఎంపీ

**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూలై 31, సెంట్రల్ డెస్క్ :**
ఇంజినీరింగ్ ఎడ్యుకేషన్ ఓ క్రిమినల్ వేస్ట్ అన్న తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యలపై బీజేపీ ఎంపీ నిషికాంత్ దుబే తీవ్రంగా స్పందించారు. ఈ మేరకు సీఎంను ఉద్దేశించి కీలక వ్యాఖ్యలు చేశారు. రేవంత్ మంచి మనిషి అని ప్రశంసించారు. ఆయన తనకు పాత మిత్రుడని చెప్పుకొచ్చారు.ఢిల్లీలోని పార్లమెంట్ వద్ద దుబే మీడియాతో మాట్లాడారు. గతంలో తామిద్దరం రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్, అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ లలో కలిసి పనిచేశామని గుర్తుచేశారు. ఎబివిపి నేపథ్యం ఉండటంతో రేవంత్ రెడ్డి ఆలోచనా విధానం బాగుంటుందని కితాబిచ్చారు. అయితే, ఆయన ప్రస్తుతం కాంగ్రెస్‌లో ఉన్నందున రాహుల్ గాంధీ చెప్పినట్లు నడుచుకోవాల్సి వస్తోందని వ్యాఖ్యానించారు. రేవంత్ ప్రస్తుతం తీవ్రమైన ఒత్తిడికి గురవుతున్నారని పేర్కొన్నారు. రాహుల్ చెప్పినదానికంతా తలాడిస్తున్నాడని.. ఏది చెప్పమంటే అదే చెబుతున్నారని మండిపడ్డారు. ఇందులో రేవంత్ రెడ్డి తప్పేమీ లేదని చెప్పుకొచ్చారు. దుబే వ్యాఖ్యలు ప్రస్తుతం వైరల్ అవుతున్నాయి.



# ప్రకృతిని ప్రతి ఒక్కరూ గౌరవించండి



- ప్రతి ఒక్కరూ మొక్కలు నాటండి.
- దత్తగిరి పీఠాధిపతులు
- అవధూతగిరి, సిద్దేశ్వరానందగిరి మహారాజ్
- భక్తిశ్రద్ధలతో జప యజ్ఞం.

**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూలై 31, జహీరాబాద్:**
తల్లిదండ్రులను గౌరవించడం, గోమాతను సంరక్షించడం, ప్రకృతి పరిరక్షణతో పాటు పాడిపంటలు సమృద్ధిగా పండాలని, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో జీవించాలని సంకల్పంతో బర్దిపూర్ దత్తగిరి మహారాజ్ ఆశ్రమంలో శుక్రవారం మహా మృత్యుంజయ లక్ష జప యజ్ఞం, శివపార్వతుల కళ్యాణం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు మహా మృత్యుంజయ మంత్రాన్ని లక్షసార్లు పారాయణం చేశారు. ఉదయం గణపతి పూజతో ప్రారంభమైన జప యజ్ఞం మధ్యాహ్నం 2 గంటల 15 నిమిషాలకు పూర్ణాహుతితో ముగిసింది. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి ప్రకృతిని ప్రేమించాలని పీఠాధిపతులు భక్తులకు ఉపదేశించారు. యజ్ఞంలో బర్దిపూర్ గ్రామానికి చెందిన సంగీత-కాశీనాథ్, శివనాగమ్మ, రమేష్ పాటిల్, కోట స్వరూప, శ్రీనివాస్, సువర్ణ, నాగన్న పాటిల్, పుష్పమ్మ, ఎల్లన్న దంపతులు పాల్గొన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా దత్తగిరి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పూర్తి ఏర్పాట్లు చేశారు.

# సికింద్రాబాద్ మోండా డివిజన్‌లో.. ఇందిరమ్మ కాంటీన్ ప్రారంభించిన ఎమ్మెల్యే శ్రీగణేష్




**జూలై 31, సికింద్రాబాద్, హైదరాబాద్ పల్స్ ప్రతినిధి :**
సికింద్రాబాద్ నియోజకవర్గ పరిధిలోని మోండా డివిజన్, సెయింట్ ఆన్స్ స్కూల్ పక్కన గల కొండల్ రెడ్డి స్ట్రీట్ వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన "ఇందిరమ్మ కాంటీన్" ను స్థానిక ఎమ్మెల్యే శ్రీగణేష్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీగణేష్ మాట్లాడుతూ నియోజకవర్గంలో పేద, మధ్యతరగతి ప్రజలు, నిత్యం ప్రయాణించే కార్మికులు, వ్యాపారులకు విద్యార్థులకు, నిరుద్యోగులకు నాణ్యమైన, పౌష్టికాహారాన్ని అందుబాటు ధరల్లో అందించడమే లక్ష్యంగా ఈ కాంటీన్లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.నియోజకవర్గంలో మొత్తం 8 ఇందిరమ్మ కాంటీన్లు ఏర్పాటు చేస్తున్నామని, అందులో భాగంగా శుక్రవారం రోజు 3వ కాంటీన్ ప్రారంభించామన్నారు ఎమ్మెల్యే. తక్కువ ఖర్చుతో కేవలం 5 రూపాయలకే కడుపు నిండా స్వచ్ఛమైన, పోషకాహారం అందించడం జరుగుతుందని మిగిలిన 5 కాంటీన్లను కూడా త్వరలోనే ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే తో పాటు బోయిన్ పల్లి సర్కిల్ డిసి డాకూ నాయక్, స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, డివిజన్ ప్రజలు మరియు నాయకులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రజా సమస్యలపై తక్షణం స్పందిస్తూ.. మార్గదర్శిని కాలనీలో ఎమ్మెల్యే పర్యటన



**జూలై 31, కంటోన్మెంట్,హైదరాబాద్ పల్స్ ప్రతినిధి :**
కంటోన్మెంట్ నియోజకవర్గంలోని రసూల్‌పురా, వార్డు-2 పరిధిలోని మార్గదర్శిని కాలనీలో స్థానిక శాసనసభ్యులు శ్రీగణేష్ పర్యటించారు. ముందుగా కాలనీలోని జైన్ కమ్యూనిటీ హాల్‌లో కాలనీ వాసులతో ప్రత్యేకంగా సమావేశమైన ఎమ్మెల్యే, వారి సంక్షేమం మరియు కాలనీ అభివృద్ధిపై మాట్లాడారు వారి వినతి పత్రాన్ని స్వీకరించారు. అనంతరం కాలనీలో పర్యటించి, స్థానికులు ఎదుర్కొంటున్న డ్రైనేజీ, మంచి నీటి సరఫరా, రోడ్లు, వీధి దీపాలు తదితర సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు.కాలనీ వాసులు తెలిపిన సమస్యలపై ఎమ్మెల్యే శ్రీగణేష్ తక్షణమే స్పందించారు. సంబంధిత శాఖల అధికారులతో అక్కడికక్కడే ఫోన్ ద్వారా మాట్లాడి, కాలనీలోని సమస్యలను యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ పర్యటనలో కాలనీ సంక్షేమ సంఘం నాయకులు, కాలనీ ప్రజలు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## పూర్తిగా మద్యపానం, అక్రమ ఇసుక రవాణా ను నిషేధించాలి

### సిఐ, ఎక్సైజ్ సీఐ, డిప్యూటీ తాసిల్దార్ లకు తీర్మానం కాపీలను అందజేసిన కొలనుపాక పాలకవర్గం




**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూలై 31, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** యాదాద్రి భువనగిరి జిల్లా, ఆలేరు మండలం కొలనుపాకలో పూర్తిగా మద్యపానం, అక్రమ ఇసుక రవాణా ను నిషేధించాలని తీర్మానం చేసిన కాపీలను సర్పంచ్ బెదరబోయిన యాకమ్మ వెంకటేష్ మరియు ఉప సర్పంచ్ గొట్టం విజయేందర్ రెడ్డి, పాలకవర్గం, అఖిలపక్షం ఆధ్వర్యంలో సిఐ యాలాద్రి, ఎక్సైజ్ సీఐ దీపిక, డిప్యూటీ తాసిల్దార్ ఉపేందర్ లకు తీర్మానం కాపీలను అందజేశారు.

## మొక్కలను పంపిణీ చేసిన సర్పంచ్ బొడ్డు భాస్కర్



**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూలై 31, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** యాదాద్రి భువనగిరి జిల్లా, రాజపేట మండలం కుర్రారం గ్రామపంచాయతీ పరిధిలో వివిజి రాంజీ ఉపాధి హామీలో భాగంగా గ్రామంలో నర్సరీలో పెంచిన వివిధ రకాల పువ్వుల మొక్కలను సర్పంచ్ బొడ్డు భాస్కర్ గ్రామ ప్రజలకు అందించారు. ఈ సందర్భంగా సర్పంచ్ బొడ్డు భాస్కర్ మాట్లాడుతూ...ప్రతి ఇంటికి మూడు మొక్కలు చొప్పున నాటాలని చెప్పారు. అలాగే మొక్కలను సంరక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బొడ్డు భాస్కర్, ఉపసర్పంచ్ రావి కొండల్ రెడ్డి, వార్డు సభ్యులు, ఎండి యూసఫ్, ఎర్రగుంట ప్రభాకర్, మేడి స్వరూప మాజీ సర్పంచ్ బూరుగు రమేష్, ఫీల్డ్ అసిస్టెంట్ జంగిటి మధులత, ఇందిరమ్మ కమిటీ అధ్యక్షులు పాండవుల బసవరాజ్ గౌడ్, కాంగ్రెస్ యూత్ అధ్యక్షులు నంద నరేష్ గ్రామ పంచాయతీ సిబ్బంది ఊట్కూరి రవీందర్ నాగరాజు, గ్రామ పెద్దలు, మహిళలు యువకులు తదితరులు పాల్గొన్నారు.

## పెద్ది సుదర్శన్ రెడ్డికి ఘన నివాళులర్పించిన జీ.ఎం.ఆర్ టీం సభ్యులు



**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూలై 31, నారాయణ ఖేడ్ :** నారాయణఖేడ్ పట్టణంలోని బి ఆర్ యస్ పార్టీ కార్యాలయంలో నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డికి జీఎంఆర్ టీం సభ్యులు ఘనంగా నివాళు లర్పించారు. ఆయన రాజకీయ జీవితంలో ప్రజల కోసం చేసిన సేవలు, అభివృద్ధి కార్యక్రమాలు, గ్రామీణ ప్రాంతాల అభ్యున్నతికి అందించిన కృషి గురించి ఈ సందర్భంగా ప్రత్యేకంగా గుర్తు చేసుకున్నారు. ప్రజల సమస్యలపై ఎప్పుడూ ముందుండి పోరాడిన నాయకుడిగా ఆయనకు ఉన్న గుర్తింపు గురించి నాయకులు భావోద్వేగంగా మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జీఎంఆర్ టీం సభ్యులు సీతారామ్, తండా మాజీ సర్పంచ్ రాజు నాయక్, మాజీ వార్డు సభ్యుడు సాయిలు, నాయకులు తుకారాం, శ్రీనివాస్ సాగర్, అభి పవర్, యువ నాయకుడు మోహన్, విఠల్, అంజి గౌండ, గంగారం, హరి కృష్ణ తదితరులు పాల్గొని, పెద్ది సుదర్శన్ రెడ్డి సేవలను స్మరించుకుంటూ పుష్పాంజలి ఘటించి ఘన నివాళులర్పించారు.

## ఎస్.ఆర్.కే.టి స్కూల్లో ఘనంగా ఆషాడ మాస బోనాలు

**భక్తి శ్రద్ధలతో బోనమెత్తిన ఎస్.ఆర్.కే.టి చిన్నారులు**

**అమ్మవారి వేషధారణతో చిన్నారి స్వేచ్ఛ**

**నృత్య ప్రదర్శనలతో ఆకట్టుకున్న పోతురాజులు**





**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూలై 31, భద్రాద్రి జిల్లా ప్రతినిధి :**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం మేధర బస్తి ఎస్.ఆర్.కె.టి స్కూల్ లో ఘనంగా ఆషాడ బోనాల సంబరాలు నిర్వహించడం జరిగింది. చిన్నతనం నుండే విద్యార్థులకు మన సంస్కృతి సాంప్రదాయాలను తెలియజేసే ఉద్దేశంతో మేదర బస్తి ఎస్సార్ కే టి స్కూల్లో చిన్నారులచే దుర్గమ్మ తల్లికి ఆషాడ మాస బోనాల కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలు ఉట్టిపడేలా ఎల్కేజీ,యూకేజీ మొదలు ప్రీమియం తరగతుల విద్యార్థులు తాము ఆరోగ్యంగా ఉండాలి, చదువులు బాగా రావాలని అమ్మ వారికి బోనమెత్తారు. మట్టి కుండల్లో నైవేద్యాన్ని ఉంచి, పసుపు కుంకుమ వేపాకులతో అలంకరించారు. ముందుగా సెంట్ పీటర్ మోడ్రన్ హై స్కూల్ నుండి మేళతాళాలతో ఎస్సార్ కేటి స్కూల్ మేధర బస్తి వరకు ఊరేగింపుగా బోనాలు ఎత్తుకొని చిన్నారులు నాట్యం చేస్తూ బోనాలు ఎత్తుకొని ఊరేగింపుగా రావడం జరిగింది. ఎంతో ఉత్సాహంగా భక్తి శ్రద్ధలతో అమ్మలను గన్న అమ్మ శ్రీ దుర్గమ్మవారికి బోనాలను సమర్పించారు. బోనాలు ఎత్తుకొని ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన అమ్మవారి వద్దకు స్కూల్ యజమానులతొ కలిసి బోనాలు సమర్పించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం జంట నగరాలైన హైదరాబాద్ సికింద్రాబాద్ లలో బోనాల జాతర అత్యంత పవిత్రంగా జరుగుతుందని అదేవిధంగా ఆషాడ మాసం ఊరురా జరుపుకునే సాంప్రదాయ పండుగ బోనాల పండుగ అని అన్నారు. కొత్తగూడెంలో ఎస్ ఆర్ కె టి స్కూల్లో బోనాల పండుగ ఘనంగా నిర్వహించడం జరిగిందని. రైతు బాగుంటే దేశం బాగుంటుందని అలాంటి రైతుకు పంటలు బాగా పండి సంతోషంగా జీవించేలా చల్లగా చూడమ్మా అంటూ అమ్మవారిని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో అమ్మవారి వేషాధారణలో చిన్నారి స్వేచ్ఛ, నృత్య ప్రదర్శనలో పోతురాజులు ఆకర్షణీయంగా నిలిచారు. నర్సరీ నుండి విద్యార్థిని విద్యార్థులు టీచర్లు అందరూ కలిసి సంతోషంగా నృత్యాలు చేస్తూ అమ్మవారికి బోనాలు సమర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం మేధార్ బస్తి ఎస్సార్ కే టి స్కూల్ డైరెక్టర్స్ కోట్ల రామరాజు, గుగులోత్ హాతీరామ్, ప్రిన్సిపాల్ స్వర్ణ, ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

### ప్రభుత్వ పాఠశాలల సమస్యలపై

## వ్యవసాయ కార్మిక సంఘం ఐద్వా ఆధ్వర్యంలో సర్వే

**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూలై 31, భద్రాద్రి జిల్లా ప్రతినిధి :**
బూర్గంపాడు మండల పరిధిలో గల తాళ్లగొమ్మూరు పంచాయతీ ప్రభుత్వ పాఠశాలల్లో వ్యవసాయ కార్మిక సంఘం, ఐద్వా సంఘం ఆధ్వర్యంలో పాఠశాలల సమస్యలపై శుక్రవారం సర్వే నిర్వహించారు. తాళ్లగొమ్మూరు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఒక ఇన్చార్జి ప్రధానోపాధ్యాయురాలు, ముగ్గురు ఉపాధ్యాయులు, 31 మంది విద్యార్థులు ఉన్నట్లు గుర్తించారు. ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకు శాశ్వత ప్రధానోపాధ్యాయుడు లేకపోవడంతో విజయకుమారి ఇన్చార్జి హెడ్‌మిస్ట్రెస్‌గా విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. విద్యార్థులకు ఇప్పటివరకు పాఠశాల యూనిఫాంలు అందలేదని, త్వరలో కొత్త యూనిఫాంలు వస్తాయని ఆమె పేర్కొన్నారు.



మధ్యాహ్న భోజన పథకం వర్కర్లు రాయల లక్ష్మి, మారం పుష్ప మాట్లాడుతూ తమకు నెలకు కేవలం రూ.3,000 మాత్రమే వేతనం అందుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. వంటగది భవనాలు శిథిలావస్థలో ఉండటంతో వర్షాకాలంలో వర్షం పడుతున్నా అదే పరిస్థితుల్లో వంట చేసి విద్యార్థులకు భోజనం అందించాల్సి వస్తోందన్నారు. కోడిగుడ్డుకు ప్రభుత్వం రూ.6 మాత్రమే చెల్లిస్తుండగా, మార్కెట్ ధర రూ.9.50 ఉండటంతో ఒక్కో గుడ్డుపై రూ.3.50 తమ జేబు నుంచి భరించాల్సి వస్తోందని తెలిపారు. ఎన్నికల సమయంలో రూ.10,000 వేతనం ఇస్తామని హామీ ఇచ్చినప్పటికీ ప్రస్తుతం రూ.3,000 మాత్రమే ఇస్తున్నారని, అది కూడా ప్రతి నెల సకాలంలో అందడం లేదని వాపోయారు. గ్యాస్ ధరలు విపరీతంగా పెరిగాయని, పాఠశాలలో ఒక్క గ్యాస్ సిలిండర్ మాత్రమే ఉండటంతో అది అయిపోతే వెంటనే కొత్త సిలిండర్ అందడం లేదని, ప్రత్యామ్నాయంగా ఉపయోగించేందుకు కట్టెలు కూడా అందుబాటులో లేవని మధ్యాహ్న భోజన వర్కర్లు తెలిపారు. ఈ సర్వేలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యురాలు ఎస్.కే. అబీద, మండల కమిటీ సభ్యురాలు మరియమ్మ, సంఘం జిల్లా నాయకురాలు పాపినేని సరోజినీ, మండల నాయకురాలు, కవులూరి నాగమణి, మడకం లత, తదితరులు పాల్గొనడం జరిగింది.

## కలెక్టర్ స్నేహ శబరీష్ ను మర్యాద పూర్వకంగా కలిసిన టీజేఏ జిల్లా నూతన కమిటీ

**మహబూబాబాద్ ప్రతినిధి,జూలై 31, హైదరాబాద్ పల్స్ న్యూస్ :**
తెలంగాణ జర్నలిస్ట్ అసోసియేషన్ (టీజేఏ) మహబూబాబాద్ జిల్లా నూతన కమిటీ సభ్యులు శుక్రవారం జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా టిజేఏ యూనియన్ జిల్లా అధ్యక్షులు మేకరబోయిన నాగేశ్వర్ యూనియన్ లోని అంశాలపై కలెక్టర్ కు వివరించగా సంబంధిత శాఖ అధికారిని సంప్రదించమని తెలిపారు. అనంతరం జిల్లా సమాచార, ప్రజా సంబంధాల అధికారి (డిపిఆర్ఓ) రాజేంద్ర ప్రసాద్ ను మర్యాద పూర్వకంగా కలవడం జరిగింది. ఈ సందర్భంగా డిపిఆర్ఓ నూతన కమిటీకి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం టీజేఏ మహబూబాబాద్ జిల్లా నూతన కమిటీని టీజేఏ ఫౌండర్, అడ్వైజరీ కమిటీ చైర్మన్ ఉప్పల లక్ష్మణ్





ఆదేశాల ప్రకారం రాష్ట్ర నాయకత్వం జిల్లా కమిటీని ప్రకటించారు. టీజేఏ జిల్లా అధ్యక్షుడిగా మేకరబోయిన నాగేశ్వర్, జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఇండ్ల మహేష్, ఉపాధ్యక్షుడిగా ఎర్ర మురళి, కార్యదర్శిగా గుగులోతు రమేష్, జిల్లా కోశాధికారిగా జక్కుల మురళి, కమిటీ సభ్యులుగా గాడిపల్లి సందీప్, పొన్నబోయిన వెంకన్న, గుగులోతు నరేష్, బూరుగు శ్రీకాంత్ ఎన్నుకోవడం జరిగిందని తెలిపారు. అనంతరం టీజేఏ జిల్లా అధ్యక్షుడు నాగేశ్వర్ మాట్లాడుతూ తమ ఎన్నికల ప్రక్రియలో సహకరించిన టీజేఏ ఫౌండర్, అడ్వైజరీ కమిటీ చైర్మన్ ఉప్పల లక్ష్మణ్, రాష్ట్ర అధ్యక్షుడు రమణరావు, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజేంద్రనాథ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఘోరీలకు కృతజ్ఞతలు తెలిపారు. జర్నలిస్టుల అభివృద్ధి, సంక్షేమ కోసం టీజేఏ యూనియన్ కృషి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఎండి జాకీర్ హుస్సేన్, జినుక శేఖర్, మధు తదితరులు పాల్గొన్నారు.

## పాకిస్తాన్ 70 ఏళ్ల వ్యవస్థ సర్వనాశనం: సొంత ప్రభుత్వంపైనే హోంమంత్రి బిగ్ బాంబ్!

**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూలై 31 :**
పాకిస్తాన్‌లో నెలకొన్న ఆర్థిక, రాజకీయ సంక్షోభం మధ్య ఆ దేశ హోంమంత్రి మొహ్సిన్ నఖ్వీ ఓ కీలక ప్రకటన చేశారు. అధికార కేంద్రంలో కొలువుదీరిన మొహ్సిన్ నఖ్వీ.. పాకిస్తాన్ ప్రస్తుత పాలన వ్యవస్థ పూర్తిగా కుప్పకూలిపోయిందని.. దేశ 70 ఏళ్ల పురాతన వ్యవస్థ నిర్మాణం పూర్తిగా విఫలమైందని బహిరంగంగా అంగీకరించారు. ఓ కార్యక్రమంలో మొహ్సిన్ నఖ్వీ ప్రసంగిస్తూ.. దేశంలోని వాస్తవ పరిస్థితులను నిష్కపటంగా వివరించారు. నమ్మినా నమ్మకపోయినా మనం జీవిస్తున్న వ్యవస్థ ఇప్పటికే కుప్పకూలిపోయిందని పాక్ ప్రజలను ఉద్దేశించి పేర్కొన్నారు. పాకిస్తాన్ దేశ ప్రస్తుత వ్యవస్థ పూర్తిగా నాశనమైపోయిందన్నారు. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే పదేళ్ల తర్వాత కూడా మనం అవే సమస్యలు, అంశాల గురించి చర్చిస్తూనే ఉంటామన్నారు. గత 70 ఏళ్లుగా పాకిస్తాన్ అనుసరిస్తున్న వ్యవస్థ ఇక పనిచేయడం లేదని మొహ్సిన్ నఖ్వీ పేర్కొన్నారు. ప్రజలందరూ ప్రజాస్వామ్యాన్ని కోరుకుంటారని.. కానీ ప్రజాస్వామ్యంలోనే మూడు నాలుగు రకాల వ్యవస్థలు ఉన్నాయన్నారు. గత 70 ఏళ్లుగా మనం అనుసరిస్తున్న వ్యవస్థ మనల్ని ఎక్కడికీ తీసుకెళ్లలేదని.. మనం ఇంకా అక్కడే చిక్కుకోపోయామని అన్నారు.




**ఆ ప్రకటనకు మోగిన చప్పట్లు:**
అధికారంలో ఉన్న హోంమంత్రి తన సొంత ప్రభుత్వం, వ్యవస్థ వైఫల్యాల్ని అంగీకరించడం అత్యంత దిగ్భ్రాంతికరంగా పరిగణించబడుతోంది. మరీ ముఖ్యంగా మొహ్సిన్ నఖ్వీ వ్యవస్థ పూర్తిగా కుప్పకూలిందని మాట్లాడినప్పుడు ఆయన ముందున్న ప్రేక్షకులు చప్పట్లు కొట్టడం ప్రారంభించారు. పాకిస్తాన్ హోంమంత్రి చేసిన ఈ ప్రకటన ఆ దేశంలో తీవ్రమవుతున్న పరిపాలనా, ఆర్థిక, సంస్థాగత సంక్షోభానికి నిదర్శనంగా నిలిచింది. దేశ అంతర్గత భద్రత, శాంతిభద్రతల బాధ్యతలు చూస్తున్న మంత్రి నుంచి వెలువడిన ఈ ప్రకటన.. పాకిస్తాన్‌లోని రాజ్యాంగ, పరిపాలనా సంస్థలు ఎంత శక్తిహీనంగా, అసమర్థంగా తయారయ్యాయో తెలియజేస్తోంది.

# 4 లేబర్ కోడ్లు, బిబిజి రాంజీ చట్టాన్ని రద్దు చేయాలి

**విద్యుత్ బిల్లు, విత్తన బిల్లులను రద్దు చేయాలి.**

**కేంద్ర ప్రభుత్వ కార్మిక, కర్షక ప్రజావ్యతిరేక విధానాలు నశించాలి.**

**ఆగస్టు 10 జైలు బరో జయప్రదం చేయండి.**

**సీఐటీయూ, ఎ.ఐ.ఎ.డబ్ల్యూ.యూ, ఎ.ఐ.కె.యస్ పిలుపు.**

**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూలై 31, నారాయణ ఖేడ్ :**
సిఐటియు, వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘాల కేంద్ర కమిటీల పిలుపుమేరకు ఆగస్టు 10న జైల్ బరో కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని, కంది మండల 3 సంఘాల ముఖ్య కార్యకర్తల సమావేశం నల్లవల్ల రమేష్ అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా జి. సాయిలు సిఐటియు జిల్లా కార్యదర్శి, ఎం. నర్సిములు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మాట్లాడుతూ.. కేంద్రంలో అధికారంలో ఉన్నటువంటి ప్రభుత్వం గత 12 సంవత్సరాలుగా 10 శాతం మంది కార్పోరేట్ శక్తుల కొమ్ముగాస్తూ, వారిని శతకోటీశ్వరులుగా తీర్చిదిద్దుతూ, నూటికి 90 శాతంగా ఉన్నటువంటి కార్మికులు, కర్షకులు, పేదలపై భారాలు మోపుతూ ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తుందని మండిపడ్డారు. 29 కార్మిక చట్టాలను మార్చి 4 లేబర్ కోడ్లు గా తీసుకువచ్చి యాజమాన్యాల కే హక్కులు కల్పిస్తూ కార్మిక వర్గాన్ని బానిసలుగా చేసే నాలుగు లేబర్ కోడ్లను వెంటనే రద్దు చేయాలని అన్నారు. యూనియన్ పెట్టుకునే హక్కును తొలగిస్తూ కనీస వేతనాలు, కనీస సౌకర్యాలను అడగొద్దంటూ యాజమాన్యాలకు కట్టు బానిసలుగా కార్మికులను మార్చే కేంద్ర ప్రభుత్వ విధానాన్ని కార్మిక వర్గం అంతా తిప్పి కొట్టాలని అన్నారు. మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామన్న కేంద్ర ప్రభుత్వం ఎందుకు కల్పించడం లేదని మహిళా సోదరీమణులందరూ




కేంద్ర ప్రభుత్వంపై ఉద్యమించాలని అన్నారు. నూటికి 90 శాతం గా ఉన్నటువంటి పేదలపై గ్యాస్, పెట్రోలు, డీజీల్, నిత్యవసర సరుకులు ధరలు పెంచి ప్రజలపై ధారాలను మోపుతూ అంబానీ, ఆదానీ లాంటి కార్పోరేట్ శక్తులకు లక్షల కోట్ల రూపాయలు రాయితీలు ఇచ్చి వారిని శతకోటీశ్వరులుగా పెంచడమే కేంద్ర ప్రభుత్వ నైజం అని, ప్రజానికమంతా ఆగస్టు 10న జైలు భరో కార్యక్రమంలో పాల్గొని కేంద్ర ప్రభుత్వ మెడలు వంచాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

# నదిలో చిక్కుకున్న 55మంది డ్రైవర్లు, ఆపరేటర్లను రక్షించిన యంత్రాంగం

**నదిలో వాహనాలను వదిలి వెళ్ళిన డ్రైవర్లు**

**పోలీసుల సేవలు అభినందనీయం**

**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూలై 31, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా :**
చర్ల మండలం వీరాపురం గ్రామ పరిధిలోని ఇసుక ర్యాంపులో గోదావరి నదికి అకస్మాత్తుగా వరద ఉధృతి పెరగడంతో ఇసుక లోడింగ్ పనుల కోసం ర్యాంపుకు వచ్చిన లారీలు, డ్రైవర్లు, ఆపరేటర్లు మొత్తం 55 మంది వరద నీటిలో చిక్కుకుపోయారు. గోదావరి నీటి ప్రవాహం ఒక్కసారిగా పెరగడంతో ర్యాంపు చుట్టూ నీరు చేరి అక్కడ ఉన్నవారు బయటకు వచ్చే పరిస్థితి లేకపోయింది. స్థానికుల సమాచారం ఏరా విషయం తెలుసుకున్న అధికారులు రెవెన్యూ, పోలీసు, ఇసుక ర్యాంపు నిర్వాహకులు స్థానికులు అప్రమత్తమై సహాయక చర్యలను ప్రారంభించారు. ముందుగా నైపుణ్యం కలిగిన గజ ఈతగాళ్లను రంగంలోకి దింపి గోదావరిలో చిక్కుకున్న 15 మందిని సురక్షితంగా ఒడ్డుకు తరలించారు. మిగిలిన 40 మందిని చర్ల సిఐ రాజు వర్మ ఎస్ఐ నర్సిరెడ్డి వారి ప్రాణాల సైతం లెక్కచేయకుండా తెప్పలపై నది దాటి వెళ్లి భారీ యంత్రాలతో సాయంతో మిగిలిన వారిని సురక్షితంగా ఒడ్డుకు చేర్చారు. వరద నీటి ప్రవాహం కొనసాగుతున్న నేపథ్యంలో అధికారులు పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఎలాంటి ప్రాణనష్టం జరగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నారు. గోదావరి నది వరద ఉదృతి వలన పరిసర ప్రాంతాలకు వెళ్లవద్దని అధికారుల సూచించారు. గోదావరిలో చిక్కుకున్న లారీ డ్రైవర్లను, ఆపరేటర్లను




సురక్షితంగా బయటికి చేర్చిన చర్ల సీఐ రాజు వర్మ, ఎస్.ఐ నర్సిరెడ్డి, తాసిల్దార్ శ్రీనివాస్ ఎంపీడీవో ఈదయ్య లను గ్రామస్తులు అభినందించారు. ఈ సహాయక చర్యల్లో మండల తాసిల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో ఈదయ్య చర్ల సీఐ రాజు వర్మ, ఎస్సై నర్సిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# బేతోలులో తాళం వేసిన ఇంట్లో చోరీ

**రూ.1.90 లక్షల ఆస్తి అపహరణ**

**హైదరాబాద్ పల్స్, జూలై 31, మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి:**
మహబూబాబాద్ జిల్లా కురవి మండలం బేతోలు గ్రామంలో తాళం వేసి ఉన్న ఓ ఇంటిని లక్ష్యంగా చేసుకున్న గుర్తుతెలియని దుండగులు బంగారం, వెండి ఆభరణాలతో పాటు నగదును అపహరించిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. శుక్రవారం కురవి ఎస్ఐ సతీష్ తెలిపిన వివరాల ప్రకారం, గ్రామానికి చెందిన గైని వెంకన్న ఈ నెల 29న వైద్య పరీక్షల నిమిత్తం ఖమ్మం వెళ్లే ముందు ఇంటికి, వంటగదికి, పడకగదికి, కాంపౌండ్ గేటుకు తాళాలు వేసి కుటుంబ సభ్యులతో





కలిసి వెళ్లారు. జూలై 31న మధ్యాహ్నం ఇంటికి తిరిగి రాగా ప్రధాన ద్వారం తాళం తెరిచి ఉండటంతో అనుమానం వ్యక్తమైంది. వెంటనే ఇంట్లోకి వెళ్లి పరిశీలించగా పడకగది, వంటగది తాళాలతో పాటు బీరువా తలుపులు ధ్వంసం చేసిన ఆనవాళ్లు కనిపించాయి. బీరువాలో భద్రపరిచిన సుమారు నాలుగు తులాల బంగారు ఆభరణాలు, కుటుంబ సభ్యులకు చెందిన మొత్తం 53 తులాల వెండి ఆభరణాలు, రూ.20 వేల నగదు కనిపించకపోవడంతో చోరీ జరిగినట్లు గుర్తించారు. అపహరణకు గురైన ఆస్తి మొత్తం విలువ సుమారు రూ.1.90 లక్షలు ఉంటుందని బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు కురవి పోలీసులు భారతీయ న్యాయ సంహితలోని సంబంధిత సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఘటన స్థలాన్ని పరిశీలించిన పోలీసులు ఆధారాలు సేకరించి, నిందితులను గుర్తించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు తెలిపారు.

# సోలార్ రంగంలో మరో విప్లవం.. రూ. 5,070 కోట్ల నిధులతో కొత్త స్కీమ్ తీసుకొచ్చిన కేంద్రం.!

**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూలై 31, సెంట్రల్ డెస్క్:**
దేశంలో సౌరశక్తిని, సరసమైన విద్యుత్‌ను ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం ఒక కీలక నిర్ణయం తీసుకుంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన కేంద్ర మంత్రివర్గ సమావేశంలో 'ప్రధానమంత్రి సూర్య సరోవర్ యోజన' (పీఎం-ఎస్-ఎస్‌వై)కు కేంద్రం ఆమోదం తెలిపింది. ఈ పథకం కోసం ప్రభుత్వం సుమారు రూ.5,070 కోట్లు ఖర్చు చేయనుంది. చెరువులు, సరస్సులు, జలాశయాల ఉపరితలంపై భారీ ఫ్లోటింగ్ సోలార్ ప్రాజెక్టులను ఏర్పాటు చేయడం ద్వారా విద్యుత్ ఉత్పత్తిని పెంచడమే ఈ పథకం ప్రాథమిక లక్ష్యం.

**ప్రధానమంత్రి సూర్య సరోవర్ యోజన అంటే ఏమిటి?**
ప్రధాన మంత్రి సూర్య సరోవర్ యోజన కింద 5,000 మెగావాట్ల ఫ్లోటింగ్ సోలార్ సామర్థ్యాన్ని అభివృద్ధి చేయనున్నారు.
దీంతో పాటు, 10,000 మెగావాట్-గంటల సామర్థ్యం గల బ్యాటరీ నిల్వ వ్యవస్థను కూడా ఏర్పాటు చేయనున్నారు.
ప్రభుత్వం విడుదల చేసిన వివరాల ప్రకారం.. ఈ ప్రాజెక్టులను 2026- 2027 నుంచి 2030- 2031 ఆర్థిక సంవత్సరాల మధ్య ఆమోదించబడతాయి. ఈ ప్రాజెక్టులకు సంబంధించి ఆర్థిక సహాయ పంపిణీ




2033 వరకు కొనసాగుతుంది.

**తేలియాడే సౌర ప్రాజెక్టులు అంటే ఏమిటి?**
తేలియాడే సౌర విద్యుత్ ప్లాంట్లు అంటే భూమిపై కాకుండా, సరస్సు, ఆనకట్ట, జలాశయం లేదా చెరువు ఉపరితలంపై ఏర్పాటు చేయబడిన సౌర విద్యుత్ ప్లాంట్లు. దీనివల్ల భూమి అవసరం తగ్గి, అందుబాటులో ఉన్న నీటి వనరులను మెరుగ్గా ఉపయోగించుకోవడానికి వీలవుతుంది.

**ప్రతి మెగావాట్‌కు రూ.1 కోటి:**
విజయవంతమైన ఫ్లోటింగ్ సోలార్ ప్రాజెక్టులకు ప్రతి మెగావాట్‌కు రూ.1 కోటి వరకు కేంద్ర ఆర్థిక సహాయం లభిస్తుంది. దీంతో ప్రాజెక్టు వ్యయం తగ్గి పెట్టుబడిదారులకు ప్రోత్సాహం లభిస్తుంది.
ప్రాజెక్ట్ ప్రాథమిక రీసెర్చ్, సర్వే కోసం రూ. 50 లక్షల వరకు సహాయం అందించబడుతుంది.

**దేశానికి కలిగే ప్రయోజనం ఏమిటి?**
ఇండియా ప్రస్తుత ఫ్లోటింగ్ సోలార్ సామర్థ్యం సుమారు 700 మెగావాట్లుగా ఉంది.
కొత్త పథకం దీనిని 5,000 మెగావాట్ల మేర పెంచుతుంది.
భూసేకరణ అవసరం తగ్గుతుంది.
బ్యాటరీ నిల్వ విద్యుత్ సరఫరాను మరింత స్థిరంగా, నమ్మదగినదిగా చేస్తుంది.
జలాశయాలు, చెరువులు మరింత మెరుగ్గా ఉపయోగించబడతాయి.
ఉపాధి, పర్యావరణం కూడా ప్రయోజనం పొందుతాయి
ప్రభుత్వం ప్రకారం..ఈ పథకం ద్వారా ఏటా సుమారు 10 మిలియన్ టన్నుల కార్బన్ ఉద్గారాలు తగ్గుతాయని అంచనా. ఇది సౌర ప్రాజెక్టులకు సంబంధించిన రంగాలలో 16,000 నుంచి 17,000 ఉద్యోగాలను కూడా సృష్టించగలదు. అంతేకాకుండా ఇది సోలార్ మాడ్యూల్స్, బ్యాటరీలు, ఇతర భాగాల దేశీయ తయారీని ప్రోత్సహిస్తుంది.

## మృతురాలు కుటుంబానికి బొత్త ఫౌండేషన్ 50 కిలోల బియ్యం పంపిణీ



**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూలై 31, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** యాదాద్రి భువనగిరి జిల్లా, తుర్కపల్లి మండలం గంధమల్ల గ్రామానికి చెందిన నాగయ్యపెల్లి నరసమ్మ ఇటీవల మరణించడంతో, ఆమె కుటుంబానికి అండగా నిలుస్తూ బొత్త ఫౌండేషన్ ఆధ్వర్యంలో గ్రామ సర్పంచ్ బొత్త రాములు 50 కిలోల బియ్యాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు జింకల ఎల్లేష్ యాదవ్, ఉప సర్పంచ్ గుమ్మడి బాలరాజ్, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు గజం వంశీ, వార్డు సభ్యులు జక్కుల శ్రీశైలం, సత్యనారాయణ, జూపల్లి తిరుపతి, ఆలేటి శ్రీశైలం, నాగయ్య, పెల్లి శంకర్ తదితరులు పాల్గొని బాధిత కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

## బసంతాపురం గ్రామంలో పైలెట్ ప్రాజెక్టులో బాగంగా భూ సర్వే



**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూలై 31, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** యాదాద్రి భువనగిరి జిల్లా, రాజపేట మండలం బసంతాపురం గ్రామంలో పైలెట్ ప్రాజెక్టు కింద భూమి సర్వే చేయడం జరుగుతుంది. ఈ సర్వే కార్యక్రమానికి యాదాద్రి భువనగిరి జిల్లా జాయింట్ కలెక్టర్ వెంక రెడ్డి ఆకస్మిక తనికి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బసంతపురం సర్పంచ్ మేండు సత్తిరెడ్డి రత్నమాల మరియు గ్రామ ఉపసర్పంచ్, వార్డ్ మెంబర్లు అలాగే గ్రామపంచాయతీ కార్యదర్శి మరియు గ్రామ రైతులు పాల్గొనడం జరిగింది. సర్వే చేయడం వలన గ్రామానికి ఉపయోగల గురించి రైతులకు తెలియజేయడం జరిగింది.

## నవోదయకు దరఖాస్తు గడువు పొడిగింపు

**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూలై 31, సిద్ధిపేట జిల్లా:**
వర్గల్ జవహర్ నవోదయ విద్యాలయంలో 2027-28 విద్యా సంవత్సరానికి గాను ఆరవ తరగతిలో ప్రవేశము కొరకు ప్రవేశ పరీక్షకు హాజరయ్యేందుకు ఆన్ లైన్లో దరఖాస్తు గడువును విద్యార్థులు మరియు తల్లిదండ్రుల సౌలభ్యం కొరకు పరిపాలనా కారణాల




రీత్యా ఆగస్టు 7వ తేదీ (శుక్రవారం) వరకు పొడిగించినట్లు ప్రిన్సిపాల్ దాసి రాజేందర్ తెలిపారు. ఉమ్మడి మెదక్ జిల్లాలోని ప్రభుత్వ, లేదా గుర్తింపు పొందిన ప్రైవేటు పాఠశాలల్లో ప్రస్తుతం ఐదవ తరగతి (2026 -27) చదువుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ దాసి రాజేందర్ కోరారు. నవోదయలో ఆరవ తరగతి ప్రవేశం కోరేటటువంటి అభ్యర్థులు ప్రస్తుతం ఐదో తరగతి ఉమ్మడి జిల్లాలోనే చదువుతూ వుండి, అభ్యర్థుల తల్లిదండ్రుల నివాసము ఉమ్మడి జిల్లాలోనిదై ఉండాలని ఆయన అన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు ఏదైనా ఇంటర్నెట్ సెంటర్ ద్వారా లేదా మొబైల్ ఫోన్ ద్వారా ఆన్ లైన్ లో ఉచితంగానే దరఖాస్తు చేసుకోవచ్చు. ఇందుకు గాను ప్రధానోపాధ్యాయుడి సంతకంతో కూడిన ధ్రువపత్రం, ఫోటోతో దరఖాస్తును ఆన్లైన్లో సమర్పించవచ్చు. ఆగస్టు 7, 2026 (శుక్రవారం ) చివరి తేదీ అని,ఉమ్మడి జిల్లాలోని తల్లితండ్రులు, ఉపాధ్యాయులు త్వరపడి తమ తమ పిల్లలను ప్రోత్సహించి అధిక సంఖ్యలో దరఖాస్తు చేసుకునేలా చూడాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ప్రవేశ ఎంపిక పరీక్ష నవంబర్ 28వ తేదీ (నాలుగవ శనివారం) నాడు నిర్వహించబడుతుంది.

# 'అత్మ' కమిటీ చైర్మన్‌గా యనగండ్ల సుధాకర్

## యనగండ్ల సుధాకర్‌కు నియామక పత్రం అందజేసిన ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య




**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూలై 31, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** వ్యవసాయ సాంకేతిక నిర్వహణ సంస్థ 'ఆత్మ' ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బ్లాక్ ఫార్మర్స్ అడ్వైజరీ కమిటీ చైర్మన్‌గా యాదాద్రి భువనగిరి జిల్లా బొమ్మలరామారం మండలం చౌదర్‌పల్లి గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు యనగండ్ల సుధాకర్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా శుక్రవారం హైదరాబాద్‌లోని బంజారాహిల్స్ మినిస్టర్ క్వార్టర్స్‌లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, యనగండ్ల సుధాకర్‌కు నియామక పత్రాన్ని అందజేసి, శాలువాతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా యనగండ్ల సుధాకర్ మాట్లాడుతూ, తనపై నమ్మకంతో 'ఆత్మ' బ్లాక్ ఫార్మర్స్ అడ్వైజరీ కమిటీ చైర్మన్‌గా అవకాశం కల్పించిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యకి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. తనకు అప్పగించిన బాధ్యతలను నిబద్ధతతో నిర్వహిస్తూ, రైతులకు వ్యవసాయ రంగంలో నూతన సాంకేతిక పరిజ్ఞానం చేరవేయడంతో పాటు ప్రభుత్వ వ్యవసాయ పథకాలు క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలయ్యేలా కృషి చేస్తానని తెలిపారు. రైతుల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి, వారి అభివృద్ధి కోసం అహర్నిశలు పనిచేస్తానని ఆయన పేర్కొన్నారు.


# అంగన్వాడి సెంటర్ కు ఎలక్ట్రికల్ సామాగ్రి పంపిణీ

## బషీరాబాద్ డివిజన్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ బండి శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో



**జూలై 31, బషీర్బాగ్, హైదరాబాద్ పల్స్ ప్రతినిధి :**
ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం పనిచేస్తామని 287 పేట్ బషీరాబాద్ డివిజన్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ బండి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. పేట్ బషీరాబాద్ డివిజన్ అంగడిపేట్ లోని అంగన్వాడి సెంటర్లో ఎలక్ట్రికల్ సామాగ్రి లేకపోవడం వలన గత కొన్ని నెలల నుండి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విషయం తెలుసుకున్న బండి శ్రీనివాస్ గౌడ్ శుక్రవారం టీచర్ నాగలక్ష్మి కి ఫ్యాను లైట్లు ఎలక్ట్రికల్ వైర్ సామాగ్రిని అందజేశారు. డివిజన్ లోని అంగన్వాడి సెంటర్లలో సమస్యలు తన దృష్టికి తీసుకు సత్వరమే పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పూర్ణచందర్, స్వప్న, బి.ఎల్.ఓ లు తదితరులు పాల్గొన్నారు.

# వర్షాలు రావద్దని క్షుద్రపూజలు చేశారు.. హరీష్ రావుపై అద్దంకి దయాకర్ సంచలన ఆరోపణలు




**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూలై 31, తెలంగాణ డెస్క్:**
మాజీ మంత్రి హరీష్ రావుపై ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. సోషల్ మీడియాలో షేర్ చేసిన వీడియోలో ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ రాజకీయ అరాచకం పతాక స్థాయికి చేరుకుందని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి, తెలంగాణ ప్రభుత్వంపై వ్యతిరేఖత తీసుకువచ్చేందుకు అనేక ప్రయత్నాలు చేసి విఫలం అయ్యారని అన్నారు. చివరికి క్షుద్రపూజలు చేసి వానలను అడ్డుకోవాలని, రాష్ట్రానికి నష్టం జరగాలని చూస్తున్నారని ఆరోపించారు. హరీష్ రావు ఎక్కడికి వెళ్లి పూజలు చేస్తున్నాడో తమకు తెలుసని వ్యాఖ్యానించారు. కర్ణాటకలోని శివమొగ్గ, తిరుచ్చిలో హరీష్ రావు పూజలు చేయించారని అన్నారు. శివమొగ్గ తాంత్రిక పూజలకు ప్రసిద్ధం చెందినదని వ్యాఖ్యానించారు. ఇలా పూజలు చేయించడం దేనికి సంకేతం అని ప్రశ్నించారు. వర్షాలు రాకపోతే సమస్యలు వస్తాయని, ప్రభుత్వంపై వ్యతిరేక వస్తుందని అందుకే పూజలు చేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వంపై వ్యతిరేకత వచ్చేందుకు సోషల్ మీడియాను వినియోగిస్తున్నారని అది సరిపోక తాంత్రిక పూజలు చేయిస్తున్నారని అన్నారు. క్షుద్రపూజలపై హరీష్ రావు సమాధానం చెప్పాలని అన్నారు. అధికారం లేకపోతే బీఆర్ఎస్ నేతలు అఘోరాలుగా తయారవుతున్నారని మండిపడ్డారు. తెలంగాణకు నష్టం జరగాలని కోరుకోవడం దారుణం అని అన్నారు.

## మా నాన్న యూనిఫామ్ రక్తంతో తడిసిపోయింది..

# మాకూ న్యాయం చేయండి

### మీడియా ముందుకొచ్చిన గాయపడ్డ పోలీసు కుటుంబాలు

**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూలై 31, న్యూఢిల్లీ:**
నీట్ పేపర్ లీక్‌కు వ్యతిరేకంగా క్రాంతికారీ జనతా పార్టీ ఆధ్వర్యంలో జరిగిన ఆందోళనల సమయంలో విద్యార్థి నిరసనకారులపై పోలీసులు లాఠీఛార్జ్, పెల్లెట్ గన్స్ వాడారంటూ పెద్ద ఎత్తున విమర్శలు వెల్లువెత్తుతున్న విషయం తెలిసిందే. పోలీసుల దాడిలో అనేక మంది విద్యార్థులు గాయపడినట్లు ప్రతిపక్షాలు కేంద్రంపై విమర్శలు గుప్పిస్తున్నాయి. అయితే, ఈ ఆందోళనల్లో అనేక మంది పోలీసులు కూడా గాయపడ్డారు. పోలీసుల చర్యలపై ఆగ్రహావేశాలు వెల్లువెత్తున్న సమయంలో గాయపడ్డ పోలీసు కుటుంబాలు మీడియా ముందు తమ గోడును వెల్లబోసుకున్నాయి. తమకు న్యాయం చేయాలంటూ డిమాండ్ చేస్తున్నాయి. సీజేపీ నిరసనల్లో గాయపడిన పోలీసుల కుటుంబాలు శుక్రవారం మీడియా ముందుకు వచ్చాయి. ఈ సందర్భంగా నిరసనల సమయంలో పోలీసులు ఎదుర్కొన్న భయానక, బాధాకరమైన అనుభవాలను పంచుకున్నారు. విధి నిర్వహణలో ఉన్న పోలీసులపై ఆందోళనకారులు రాళ్లు రువ్వారని ఆరోపించారు. విద్యార్థుల ముసుగులో అసాంఘిక శక్తులు చొరబడి విధ్వంసానికి పాల్పడ్డాయని ఆరోపించారు. పోలీసులపై మూకుమ్మడి దాడి చేసి.. తిరిగి వారినే నేరస్థులుగా చిత్రీకరించారని వాపోయారు.

**యూనిఫాం వెనుక ఓ కుటుంబం ఉంటుంది:**
ఆ యూనిఫాం వెనుక కేవలం పోలీసు మాత్రమే ఉండరు. వారి వెనుక ఒక తల్లి, తండ్రి, భార్య, పిల్లలు ఇలా మొత్తం కుటుంబం ఉంటుంది. అతను విధులు పూర్తి చేసుకొని సురక్షితంగా ఇంటికి వచ్చే వరకూ కుటుంబం మొత్తం ఎదురుచూస్తుంటుంది అంటూ ఓ మహిళ మీడియా ముందు వాపోయింది.

**దాడి చేసిన వారే న్యాయం కోసం కోర్టుకెళ్లారు:**
నిరసన సమయంలో గాయపడిన ఢిల్లీ పోలీసు సబ్-ఇన్‌స్పెక్టర్ కుమార్తె కుంజల్ మాట్లాడుతూ.. తన తండ్రిపై దాదాపుగా హత్యాయత్నం జరిగిందని వాపోయారు. ఆందోళనల సమయంలో శాంతి భద్రతలను పరిరక్షించడానికి బారికేడ్ల దగ్గర ముందు వరుసలో తన తండ్రి మోహరించి ఉన్నట్లు తెలిపారు. "మా నాన్న ప్రధాన నిరసన ప్రదేశంలో ఉన్నారు. బారికేడ్ల దగ్గర ముందు వరుసలో ఉన్నారు. రోజూ



ఇంటికి వచ్చినప్పుడు నిరసనల గురించి మాతో చెప్పేవారు. ఇవి విద్యార్థి నిరసనల్లా కనిపించడం లేదని.. సంఘ వ్యతిరేక శక్తులు ఆందోళన గుంపులో చేరారని చెప్పారు. జులై 25న మధ్యాహ్నం 2 గంటల ప్రాంతంలో జంతర్ మంతర్ వద్ద వేదిక సమీపంలో విధుల్లో ఉన్న మా నాన్నను కొందరు ఆందోళనకారులు ఈడ్చుకెళ్లి మూక దాడి చేశారు.

**దాదాపు ఆయనపై హత్యా ప్రయత్నం చేశారు:**
ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన ఆయన్ని ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో దాదాపు నాలుగు గంటల పాటూ స్పృహలో లేరు. ఆ రాత్రి 10 గంటల ప్రాంతంలో మా నాన్న సహచరులు ఆయన్ని ఇంటికి తీసుకొచ్చారు. ఆ సమయంలో మా నాన్న యూనిఫామ్ పూర్తిగా రక్తంతో తడిసిపోయింది. ఆయన్ను ఆ స్థితిలో చూడటం మాకు చాలా బాధ కలిగించింది. అలాంటి రోజును మా జీవితంలో ఎన్నడూ చూడలేదు. ఆ రాత్రి మా కుటుంబం ఎదుర్కొన్న అత్యంత కష్టమైన రాత్రుల్లో ఒకటి. ఆ తర్వాత నేను సోషల్ మీడియా తెరిచి చూడగా.. మా నాన్ననే నేరస్థుడిగా చిత్రీకరించారు. దాడి చేసిన వారే సుప్రీంకోర్టును ఆశ్రయించారని తెలుసుకున్నాను. అప్పుడే నిర్ణయించుకున్నా.. మాకూ న్యాయం జరగాలని. అందుకే మేము కూడా న్యాయం కోసం సుప్రీంకోర్టులో పిటిషన్ వేశాం" అని సదరు యువతి చెప్పుకొచ్చింది. తన తండ్రి ఢిల్లీ పోలీసు విభాగంలో చేరడానికి ముందు 15 ఏళ్ల పాటు నేవీలో మెరైన్ కమాండోగా సేవలందించినట్లు సదరు యువతి తెలిపింది.

**మా ఆవేదనను కూడా వినండి:**
మరో అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ భార్య సీమా మాట్లాడుతూ.. 33 ఏళ్లుగా తన భర్త పోలీసు విభాగంలో ఉన్నారని తెలిపారు. జంతర్ మంతర్ నిరసన సమయంలో ఆయనకు కూడా డ్యూటీ పడిందని చెప్పారు. "జులై 20న ఉదయం రోజూలానే డ్యూటీకి వెళ్లారు. ఉదయం 11 గంటల ప్రాంతంలో తనతో ఫోన్‌లో మాట్లాడా. అప్పుడు ఆయన జంతర్ మంతర్ వద్ద జనసమూహం ఎక్కువగా ఉందని.. ఆందోళనకారులు పార్లమెంట్ వైపు కదిలారని చెప్పారు. ఆయన మాటలు విన్నాక నాకు చాలా ఆందోళన వేసింది. జాగ్రత్తగా ఉండమని చెప్పాను. ఆ తర్వాత నేను ఆయనతో మాట్లాడలేదు. సాయంత్రం 7 గంటలకు ఫోన్ చేస్తే అప్పుడు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు తెలిసింది. విద్యార్థుల నిరసనల మాటున అల్లరిమూకలు విధ్వంసం సృష్టించారు. రాళ్లు, చెప్పులు ఇలా చేతికి ఏవి దొరికితే వాటితో పోలీసు సిబ్బందిపై దాడి చేసి గాయపరిచారు. ఆయన పెట్టుకున్న హెల్మెట్ కూడా ధ్వంసమైంది. ఆయనకు ఏదైనా అయ్యి ఉంటే.. ఆ ఊహే నన్ను ఉలిక్కిపడేలా చేస్తోంది. విద్యార్థులపై పోలీసులు క్రూరంగా దాడి చేశారని మాత్రమే ప్రచారం చేస్తున్నారు. అది నిజం కాదు. నాణేనికి మరోవైపు కూడా ఉంది. దాన్ని ఎవరూ పట్టించుకోవట్లేదు. రాజకీయ నాయకులు మా ఆవేదనను కూడా వినాలి. ఈ విషయాలపై పార్లమెంట్‌లో గళం వినిపించాలని నేను ప్రజా ప్రతినిధులను కోరుతున్నాను" అంటూ సీమా భావోద్వేగానికి గురయ్యారు.

**నా నాన్న తలకు నాలుగు కుట్లు పడ్డాయ్:**
గాయపడిన ఓ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ (ఏసీపీ) కుమారుడు మాట్లాడుతూ తన తండ్రి ఎదుర్కొన్న పరిస్థితిని వివరిస్తూ కన్నీటి పర్యంతమయ్యారు. ఆందోళన సమయంలో తన తండ్రి తలపై తీవ్రంగా గాయమైందని చెప్పారు. నాలుగు కుట్లు పడ్డాయని చెప్పుకొచ్చారు. ఆయన్ని ఆ పరిస్థితుల్లో చూసి తాను, తన కుటుంబం తీవ్ర భయాందోళనకు గురయ్యామని ఆవేదన వ్యక్తం చేశారు. డ్యూటీ చేస్తున్న సమయంలో ఈ నిరసనల్లో సంఘ విద్రోహ శక్తులు ఉన్నట్లు తన తండ్రి చెప్పేవాడని గుర్తు చేశారు. తమకు న్యాయం చేయాలంటూ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా నిరసనల్లో పోలీసులపై దాడులకు సంబంధించిన వీడియోలను బాధిత కుటుంబాలకు ప్రదర్శించారు.

# విద్యార్థులను కించపరచడం సీఎం ఉద్దేశం కాదు : ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూలై 31, సెంట్రల్ బ్యూరో :**
విద్యార్థులను కించపరచడం సీఎం రేవంత్‌రెడ్డి ఉద్దేశం కాదని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. డిగ్రీలు పూర్తయిన తర్వాత కూడా ఇంజినీరింగ్ విద్యార్థులు సరిగా రాణించలేకపోతున్నారని.. తెలంగాణలో బోధనా ప్రమాణాలు ఆశించిన స్థాయిలో లేవని చెప్పడమే ఆయన ఉద్దేశమని తెలిపారు. అందుకే డిగ్రీలు పూర్తయిన తర్వాత కూడా ఇంజినీరింగ్ విద్యార్థులు సరిగా రాణించలేకపోతున్నారన్నదే ఆయన బాధ అని చెప్పారు. ఉపాధి పొందడంలోనూ ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. నిన్నరేవంత్ రెడ్డి విద్యా విషయక సమావేశంలో మాట్లాడిన దానిపై ఆయన ఢిల్లీలో ఓ వార్త చానల్‌తో మాట్లాడుతూ పై విధంగా స్పందించారు. రేవంత్ ప్రధానంగా నైపుణ్యాభివృద్ధి గురించే మాట్లాడాలనుకున్నారు. మరోవైపు కేటీఆర్ మాత్రం తను మెరుగైన ముఖ్యమంత్రిగా ప్రొజెక్ట్ చేసుకోవాలని చూస్తున్నారు. కేటీఆర్ తన తండ్రి నేపథ్యం వల్ల మేనేజ్‌మెంట్ కోటా ద్వారానే పైకొచ్చారు. కేటీఆర్ ఒక విషయాన్ని గ్రహించాలి. అమెరికా అధ్యక్షుడు అబ్రహాంలింకన్, బ్రిటన్ ప్రధాని విన్సెంట్ చర్చిల్‌కు ఉచ్ఛ విద్య లేకపోయినా.. వారికి అద్భుతమైన మెదడు ఉండేది. కానీ కేటీఆర్‌కు మాత్రం అలాంటి మెదడు లేదు" అని కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి విమర్శించారు.



# రేషన్ కార్డుదారులకు బంపర్ బొనంజా : ఈకేవైసీ గడువు పొడిగింపు, మూడునెలల రేషన్ ఒకేసారి

**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూలై 31, తెలంగాణ డెస్క్ :**
హైదరాబాద్ నగరంలో రేషన్ కార్డుదారులకు రాష్ట్ర ప్రభుత్వం ఒక శుభవార్త చెప్పింది. రేషన్ కార్డుకు సంబంధించి ఈ కేవైసీ ప్రక్రియ నేటితో ముగియనున్న క్రమంలో, ఇప్పటికీ ఈ కేవైసీ చేసుకోని వారి కోసం మరో కీలక నిర్ణయం తీసుకుంది. నగరంలో కొనసాగుతున్న భారీ వర్షాలు, ప్రత్యేక ఓటర్ జాబితా సవరణను దృష్టిలో పెట్టుకొని రేషన్ ఈకేవైసీ చేసే గడువును మరో నెలపాటు పొడిగిస్తున్నట్లు వెల్లడించింది.

**రేషన్ ఈకేవైసీ గడువు పొడిగింపు:**
ఆగస్టు 31వ తేదీ వరకు లబ్ధిదారులు రేషన్ ఈకేవైసీని పూర్తి చేసుకోవాలి. ఇక ఈ విషయాన్ని చీఫ్ రేషనింగ్ అధికారి రాజిరెడ్డి వెల్లడించారు. ఆగస్టు 31వ తేదీలోగా ప్రక్రియ పూర్తి చేసుకోవాలని ఆయన కీలక సూచన చేశారు. వర్షాకాలంలో ప్రజలకు ఇబ్బందులను తగ్గించడం, వేగవంతంగా ఈ కేవైసీ ప్రక్రియను పూర్తి చేయడం లక్ష్యంగా తాము ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు.

**మూడు నెలల రేషన్ ఒకేసారి:**
అలాగే రేషన్ పంపిణీ విషయంలో కూడా కీలక



నిర్ణయం తీసుకున్నట్టు పేర్కొన్నారు. ఆగస్టు 1వ తేదీ నుండి 31వ తేదీ వరకు లబ్ధిదారులు ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్ నెలలకు సంబంధించిన మూడు నెలల రేషన్ బియ్యాన్ని ఒకేసారి తీసుకోవచ్చని పేర్కొన్నారు. ప్రతినెల రేషన్ దుకాణాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా ఒకేసారి మూడు నెలల కోటాను తీసుకువెళ్లే సౌలభ్యం కలిగిస్తున్నట్టు పేర్కొన్నారు.

**ఈ కేవైసీ పూర్తి చేయకపోతే భవిష్యత్తులో నష్టం:**
రేషన్ కార్డు దారులు తమ సమీపంలోని చౌక ధరల దుకాణాలను సంప్రదించి ఈ కేవైసీ ని పూర్తి చేసుకోవాలని ఆయన సూచించారు. అంతేకాదు మూడు నెలల రేషన్ బియ్యాన్ని నిర్ణీత తేదీలలో తప్పకుండా పొందాలని తెలిపారు. ఈ కేవైసీ పూర్తి చేయకపోతే భవిష్యత్తులో నష్టం జరుగుతుందని, రేషన్ ప్రయోజనాలను కోల్పోయే అవకాశం ఉంటుందని హెచ్చరించారు.

**హైదరాబాదీలకు మరో అవకాశం.. ఈకేవైసీ చేస్కోండి:**
మరోవైపు హైదరాబాదులో లక్షలాది రేషన్ కార్డుదారులకు ఈ నిర్ణయం పెద్ద ఉపశమనం కానుంది. ఇప్పటికి చాలామంది రేషన్ కార్డుదారులు ఈ కేవైసీ పూర్తి చేసుకోని క్రమంలో గడువు పొడిగించడం వారికి అవకాశం కల్పిస్తుంది. లబ్ధిదారులు త్వరితగతిన ఈ అవకాశాన్ని వినియోగించుకొని త్వరగా ఈ కేవైసీ పూర్తి చేయాలి.

**ఈకేవైసీ చేయటానికి ఇలా చెయ్యండి:**
రేషన్ దరఖాస్తుదారులు ఈ కేవైసీ పూర్తి చేయడానికి మీ దగ్గరలోని రేషన్ షాప్ కి వెళ్ళాలి. ఈపాస్ యంత్రం ద్వారా వేలిముద్ర లేదా కంటిపాప స్కాన్ ఇవ్వాలి. మీసేవ కేంద్రాల ద్వారా కూడా ఆధార్ అనుసంధానంతో ఈ కేవైసీ పూర్తి చేసుకోవచ్చు. ఈ కేవైసీ చేయించుకోవడానికి రేషన్ కార్డు తో పాటు కుటుంబ సభ్యులందరి అసలు ఆధార్ కార్డులు తీసుకువెళ్లాలి ప్రతి కుటుంబంలో ఉన్న ఐదు సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఈ కేవైసీ చేసుకోవాలి.

# అభివృద్ధి వివక్ష–ఛైర్మన్ తీరుపై ఎంఐఎం కౌన్సిలర్ సోనీ ఇర్మియా ఆగ్రహం

**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూలై 31, జహీరాబాద్ :**
మునిసిపల్ ఛైర్మన్ మొహమ్మద్ యునుస్ తమ వార్డు పట్ల వివక్ష చూపుతున్నారని, కావాలనే తమ వార్డు అభివృద్ధికి నిధులు కేటాయించడం లేదని ఎంఐఎం పార్టీ కౌన్సిలర్ సోనీ ఇర్మియా తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. తమ వార్డులో ఎం ఐ ఎం జహీరాబాద్ ప్రెసిడెంట్ అతర్ అహ్మద్ ఎంఐఎం జిల్లా ప్రధాన కార్యదర్శి మోహియుద్దీన్ గౌరీ పార్టీ నాయకులతో కలిసి వార్డులో పర్యటించిన కౌన్సిలర్ సోనీ ఇర్మియా, అక్కడి సమస్యలను స్వయంగా చూపిస్తూ మీడియాతో మాట్లాడారు.తమ వార్డులో కనీస అవసరాలు అయిన వీధి దీపాలు, తాగునీటి సరఫరా, కాలువలు, వార్డు శుభ్రత వంటివి కూడా పూర్తిగా నిర్వీర్యం అయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు.





**బురదమయంగా వార్డు రోడ్లు :**
వర్షాకాలం రావడంతో వార్డులోని రోడ్లన్నీ బురదమయంగా మారి, మురుగు నీరు రోడ్లపైకి వచ్చి చిన్న పిల్లలు, వృద్ధులు నడవడానికి కూడా వీలు లేకుండా పోయిందని, బురద నీటిలోనే ప్రజలు నడవాల్సి వస్తోందని ఆయన అన్నారు. ప్రజల పరిస్థితి మరింత దారుణంగా ఉందని, కనీసం వీధి లైట్లు లేకపోవడంతో రాత్రి వేళల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.ఎన్నికల ముందు అందరి వార్డులను అభివృద్ధి చేస్తామన్న ఛైర్మన్, ఇప్పుడు తమ వార్డును ఉద్దేశపూర్వకంగా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. వెంటనే ఉన్నతాధికారులు స్పందించి తమ వార్డుకు ప్రత్యేక నిధులు మంజూరు చేసి, పెండింగ్ లో ఉన్న సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులు, వీధి దీపాల సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో మున్సిపల్ కార్యాలయం ముందు నిరసన దీక్షకు దిగుతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఎంఐఎం పార్టీ జహీరాబాద్ ప్రెసిడెంట్ అతర్ అహ్మద్, జిల్లా ప్రధాన కార్యదర్శి మోహియుద్దీన్ గౌరీ, ఫయాజ్ సీనియర్ నాయకులు, వార్డు ప్రజలు, యువ నాయకులు పాల్గొన్నారు.

# గద్దెనెక్కించిన మేము గద్దెనుండి దించగలము కూడా అంటూ చేర్మెన్ కు ఎం ఐ ఎం ప్రెసిడెంట్ అత్తర్ అహ్మద్ స్ట్రాంగ్ వార్నింగ్

**జహీరాబాద్ మున్సిపాలిటీలో రాజకీయ ప్రకంపనలు - మిత్రపక్షం ఎంఐఎం నుండే ఛైర్మన్ కు షాక్**

**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూలై 31, జహీరాబాద్ :**
జహీరాబాద్ మున్సిపల్ రాజకీయాల్లో ఒక్కసారిగా వేడి పుట్టింది. తమ మద్దతుతో ఛైర్మన్ పీఠం ఎక్కిన కాంగ్రెస్ అభ్యర్థి మహమ్మద్ యూనూస్, ఇప్పుడు తమనే విస్మరిస్తున్నారంటూ ఎంఐఎం పార్టీ జహీరాబాద్ ఇంచార్జ్ అత్తర్ అహ్మద్ బహిరంగంగా విరుచుకుపడ్డారు. 8వ వార్డు కౌన్సిలర్ సోనీ ఇర్మియా ఆధ్వర్యంలో వార్డులో పర్యటించిన అత్తర్ అహ్మద్, వార్డులోని అధ్వాన్న పరిస్థితిని స్వయంగా పరిశీలించారు. బురదలో కూరుకుపోయిన రోడ్లు, పొంగి ప్రవహిస్తున్న మురుగు కాలువలు, చీకట్లో మగ్గుతున్న వీధులు, గుడిసెల్లో తడిసిపోతున్న పేదల కష్టాలను చూసి చలించిపోయారు. స్థానిక ప్రజలతో, మహిళలతో, చిన్నారులతో మాట్లాడి వారి గోడును స్వయంగా విన్నారు.అనంతరం ఆయన మాట్లాడుతూ “జహీరాబాద్ మున్సిపాలిటీలో ఎంఐఎం పార్టీ నుండి గెలిచిన మాఇద్దరు కౌన్సిలర్ల మద్దతు లేకపోతే మహమ్మద్ యూనూస్ ఛైర్మన్ అయ్యేవారు కాదు. మేము నమ్మి మద్దతు ఇస్తే, ఆయన మా వార్డులను అభివృద్ధి చేయకుండా కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారు. ఇది ఎంతవరకు సమంజసం?” అని నిలదీశారు. మేము గద్దెనెక్కించగలిగామంటే, ఆ గద్దె నుండి దించే దమ్ము, సత్తా ఎంఐఎం పార్టీకి ఉంది. ఛైర్మన్ గారు జాగ్రత్తగా ఉండాలి. పార్టీలు వేరైనా ప్రజలందరూ ఒక్కటే, అందరి వార్డులను సమానంగా చూడాలి” అంటూ ఘాటుగా హెచ్చరించారు. 8వ వార్డు ప్రజలకు కనీస సౌకర్యాలు కూడా లేక నరకయాతన పడుతున్నారని, వెంటనే 8వ వార్డుకు అవసరమైన సీసీ రోడ్లు, సైడ్ డ్రైనేజీలు, వీధి దీపాలు, తాగునీటి సరఫరా వంటి కనీస అవసరాలను వెంటనే తీర్చాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో వార్డు ప్రజలతో కలిసి పెద్ద ఎత్తున మున్సిపల్ కార్యాలయం ముట్టడి, నిరసన దీక్షలు చేపడతామని స్పష్టం చేశారు.ఈ పర్యటనలో కౌన్సిలర్ సోనీ యిర్మీయా తో పాటు ఏఐఎంఐఎం పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మొహియుద్దీన్ ఘౌరి, ఫయాజ్ ఎంఐఎం పార్టీ నాయకులు, కార్యకర్తలు, వార్డు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు





# ఔరంగానగర్ లో పౌర హక్కుల దినోత్సవంపై అవగాహన కార్యక్రమం

**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూలై 31, జహీరాబాద్:**
మొగుడంపల్లి మండలం ఔరంగానగర్ గ్రామంలో పౌర హక్కుల దినోత్సవం సందర్భంగా గ్రామ ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కే.వినయ్ కుమార్, ఎస్ఐ, చిరాగ్ పల్లి, రామారావు, రెవెన్యూ ఇన్స్పెక్టర్ , బాలరాజ్, హాస్టల్ వార్డెన్ ప్రత్యేక అధికారి (సాంఘిక సంక్షేమ శాఖ) హాజరయ్యారు. గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, భారత రాజ్యాంగం కల్పించిన పౌర హక్కులు, సమాన హక్కులు, చట్టం ముందు అందరూ సమానులే అనే అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. మతం, కులం, వర్గం అనే తేడాలు లేకుండా అన్ని మతాల ప్రజలు పరస్పర గౌరవం, సోదరభావంతో కలిసి మెలిసి జీవించాలని సూచించారు.




**వర్షాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు:**
ప్రస్తుతం వర్షాకాలంలో ప్రబలుతున్న సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.
- వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి.
- మరిగించిన లేదా శుభ్రమైన తాగునీటినే తాగాలి.
- పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి.
- జ్వరం లేదా ఇతర అనారోగ్య లక్షణాలు కనిపించిన వెంటనే ప్రభుత్వ ఆసుపత్రిని సంప్రదించాలి.

ఇటీవల కురుస్తున్న ఎడతెరిపి లేని వర్షాలు, తుఫాను పరిస్థితుల దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అత్యవసరమైతే తప్ప ప్రయాణాలు చేయవద్దని, విద్యుత్ స్తంభాలు, తీగలు, చెట్లు, నీటితో నిండిన గుంతలు, వాగుల వద్ద జాగ్రత్తగా ఉండాలని, అధికారులు జారీ చేసే సూచనలను తప్పనిసరిగా పాటించాలని కోరారు.గ్రామ ప్రజలందరూ పౌర హక్కులను పరిరక్షిస్తూ, సామాజిక సామరస్యాన్ని పెంపొందించడంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని కే. వినయ్ కుమార్, ఎస్ఐ పిలుపునిచ్చారు

# పాటతో అందరినీ ఆకట్టుకున్న ఉపాధ్యాయురాలు ఇతికాల సుజాత

**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూలై 31, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :**
రాజపేట మండలంలోని సింగారం ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు లెక్కల రవీంద్రారెడ్డి పదవీ విరమణ సందర్భంగా నిర్వహించిన వీడ్కోలు సభలో కుర్రారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయురాలు ఇతికాల సుజాత ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. “సింగారం స్కూల్ మిమ్ము పిలుస్తున్నది... వదిలి వెళ్లకన్నది...” అంటూ ఆమె ఆలపించిన వీడ్కోలు గీతం సభలోని ప్రతి ఒక్కరిని భావోద్వేగానికి గురి చేసింది. రవీంద్రారెడ్డి విద్యా సేవలు, బడిబాట కార్యక్రమంలో చేసిన కృషి, ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి చూపిన అంకితభావం, సొంత నిధులతో పాఠశాల రూపురేఖలు మార్చిన సేవలు, విద్యార్థుల భవిష్యత్తు కోసం చేసిన కృషి, ఉత్తమ ఉపాధ్యాయుడిగా అందుకున్న గుర్తింపును పాట రూపంలో వర్ణించారు. అద్భుతమైన పాట రూపొందించి పాడిన ఉపాధ్యాయురాలు సుజాత కు తోటి ఉపాధ్యాయ బృందం అభినందనలు తెలిపారు.



# తెలంగాణలో ‘ఫ్యామిలీ సర్టిఫికెట్’ జారీ ప్రక్రియ ప్రారంభం




**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూలై 31, తెలంగాణ డెస్క్:**
రాష్ట్రంలో పౌర సేవలను మరింత వేగవంతం చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం మరో కీలక అడుగు వేసింది. రాష్ట్రవ్యాప్తంగా ‘ఫ్యామిలీ సర్టిఫికెట్’ జారీ ప్రక్రియను అధికారికంగా ప్రారంభించినట్లు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్వయంగా వెల్లడించారు. ప్రభుత్వ పథకాలు, వివిధ రకాల సేవలు పొందేందుకు ఈ ఫ్యామిలీ సర్టిఫికెట్ ఎంతగానో ఉపయోగపడుతుందని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. ప్రజలు తమ ఫ్యామిలీ సర్టిఫికెట్‌ను సులభంగా పొందేలా ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయాలు సమీపంలోని మీసేవా కేంద్రాల ద్వారా పౌరులు ఈ సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు.

**అధికారిక కుటుంబ వివరాలతో సర్టిఫికెట్..**
ఈ సర్టిఫికెట్‌లో కుటుంబంలోని సభ్యుల వివరాలు, వారి సంబంధాలు స్పష్టంగా నమోదు చేయబడతాయని తెలిపారు. అధికారిక కుటుంబ సమాచారంతో కూడిన ఈ ఫ్యామిలీ సర్టిఫికెట్ ప్రభుత్వ పరమైన అన్ని రకాల అవసరాలకు, వివిధ శాఖల్లో అన్ని చోట్లా చెల్లుబాటు అవుతుందని డిప్యూటీ సీఎం భట్టి స్పష్టం చేశారు.

# తెలంగాణలో మరోసారి ఎస్.ఐ.ఆర్ గడువు పెంపు




**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూలై 31, తెలంగాణ డెస్క్:**
తెలంగాణలో మరోసారి ఎస్.ఐ.ఆర్ గడువును పెంచుతూ ఈసీ ఆదేశాలు జారీ చేసింది. ఆగస్టు 10వ తేదీ వరకూ స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ గడువును పెంచుతున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకూ ఎన్యుమరేషన్ ఫార్మ్స్ సబ్మిట్ చేయని ఓటర్లు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. తొలుత జూలై 24వ తేదీతో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ గడువు ముగుస్తుందనగా.. కేంద్ర ఎన్నికల సంఘం ఈ గడువును ఆగస్టు 3వ తేదీకి పొడిగించింది. 3న రేషనలైజేషన్, పోలింగ్ స్టేషన్స్ రీ అరేంజ్మెంట్ చేయాలని ఆదేశించింది. ఆగస్టు 10న డ్రాఫ్ట్ ఓటర్ జాబితా విడుదల, క్లెయిమ్స్, అభ్యంతరాలను ఆగస్టు 10 నుంచి అక్టోబర్ 8 లోపు చేపట్టాలని తెలిపింది. అక్టోబర్ 12న తుది ఓటర్ల జాబితాను విడుదల చేస్తామని ప్రకటించింది. కానీ.. ఆగస్టు 3లోగా మొత్తం ఓటర్ల సమగ్ర సవరణకు గడువు సరిపోదని, మరోసారి గడువు పెంచాలని వినతులు రావడంతో ఆగస్టు 10వ తేదీ వరకూ ఎన్యుమరేషన్ ఫారాలు సమర్పించేందుకు గడువు పెంచింది.

# లోక్‌సభలో జనన, మరణాల నమోదు సవరణ బిల్లు 2026 ఆమోదం

**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూలై 31, సెంట్రల్ డెస్క్ :**
పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో భాగంగా మరో కీలక బిల్లుకు ఆమోదం తెలిపింది. సభలో ప్రతిపక్ష ఎంపీలు నిత్యం నిరసనలు తెలుపుతున్నప్పటికి.. కేంద్ర ప్రభుత్వం అత్యంత కీలకమైన ‘జనన, మరణాల నమోదు (సవరణ) బిల్లు 2026’ను లోక్‌సభలో ఎటువంటి చర్చ లేకుండానే ఆమోదింపజేసుకుంది. డిజిటల్ గవర్నెన్స్‌ను పటిష్టం చేయడంతో పాటు, పౌరుల జనన, మరణ ధృవీకరణ పత్రాల జారీ ప్రక్రియను మరింత సరళతరం, ఆధునీకరించే లక్ష్యంతో ఈ సవరణ బిల్లును సభ ముందుకు తీసుకువచ్చారు. సభలో చోటుచేసుకున్న పరిణామాల మధ్య విపక్షాల నిరసనలు/కోలాహలం నడుమ ఎలాంటి సమగ్ర చర్చ జరగకుండానే బిల్లుకు దిగువ సభ ఆమోదముద్ర వేసింది.ఈ నూతన సవరణ బిల్లు ద్వారా జనన, మరణాల డిజిటల్ రిజిస్ట్రేషన్ విధిగా మారి, జాతీయ, రాష్ట్ర స్థాయి డేటాబేస్‌లు అనుసంధానమవడానికి మార్గం సుగమం కానుంది. ఆధార్, ఓటర్ల జాబితా, పాస్‌పోర్ట్, రేషన్ కార్డుల వంటి పలు ప్రభుత్వ సేవలకు ఈ డేటా అనుసంధానం ఎంతో ఉపయోగపడుతుందని ప్రభుత్వ వర్గాలు భావిస్తున్నాయి. లోక్‌సభ ఆమోదం పొందడంతో, ఈ బిల్లు తుది చట్ట రూపం దాల్చడానికి తదుపరి ప్రక్రియ కోసం రాజ్యసభ ఆమోదానికి వెళ్లనుంది.




Edited, Published and Owned by Konadoddi Naveen Kumar and Printed at Srinith Publications Falcon Printing Press #1-2-201, Shop No.02, Khan Street Zaheerabad 502220.T.G. And Published from #1-2-201, Shop No.02, Khan Street Zaheerabad 502220.T.G. Editor's Konadoddi Naveen Kumar, Dr.Tadhkal Rahul Kumar Reg. No.TEL-TEL/2023/12249. Email.HyderabadPulse23@gmail.com, Web:www.HyderabadPulse.com, Cell: +91-94406 53413, +91-9989834020.